
RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 14 జూన్ 2026 ఆదివారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:22 సంచిక:13

### భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు

## రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (CURE) పరిధిలోని హై అలర్ట్ ఉండాలని ఉన్నతాధికారులకు ఆదేశించిన సీఎం

పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డ్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించిన సీఎం

చీఫ్ సెక్రటరీ, డీజీపీ, CURE స్పెషల్ సీఎస్ సహా సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షించి చర్యలు చేపట్టాలన్న సీఎం

నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించిన ముఖ్యమంత్రి.

రెయిన్ ఫోర్ కాస్టింగ్ ఆధారంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలని సూచించిన సీఎం

## గవర్నర్‌ను కలిసిన హంపి మఠాధిపతి



హైదరాబాద్, జూన్ 13, 2026: కర్ణాటకలోని హంపి మఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతీ స్వామీజీ శనివారం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు.

ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాలతో పాటు సమాజంలో విలువల పరిరక్షణ పై చర్చించారు స్వామీజీకి గవర్నర్ స్వాగతం పలికి, వారి ఆధ్యాత్మిక సేవలను అభినందించారు. ఈ సమావేశంలో మఠానికి చెందిన ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

### గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట- మంత్రి జూపల్లి

వార్తా 2 లో

# బీఆర్ఎస్, బీజేపీలు లోలోపల ఒక్కటే

**దొంగే దొంగ అన్నట్లుగా బిజెపి - బీఆర్ఎస్ నాటకాలు**

**సింగరేణికి వేల కోట్ల నష్టం చేసింది బీఆర్ఎస్సే**

**కోల్ బ్లాకుల వేలంలో పాల్గొనకుండా సింగరేణిని నిర్వీర్యం చేశారు**

**గద్దల్ని, డేగల్ని, దళారుల్ని సింగరేణిలో అడుగుపెట్టనివ్వం**

**సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి**

**సింగరేణిలో 335 మందికి కారుణ్య నియామకాలు**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



సింగరేణి సంస్థను బతికించుకుంటామని కార్మికులను రక్షించుకుంటామని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శనివారం నాడు మంచిర్యాలలో శంకరిని సంస్థలు 335 మందికి కారుణ్య నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి-బిఆర్ఎస్ పార్టీలపైన నిప్పులు చరిగారు. రెండు పార్టీలు బయటకి కొట్లాడుతున్నట్టు నటిస్తూ లోలోపల ఇద్దరు ఒకటిగా మారిపోయి ప్రజలను మోసం చేస్తుందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

సింగరేణి సంస్థలోని డిపెండెంట్ ఎంప్లాయిస్ సమస్యలపై స్పందిస్తూ, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎంతో మంది కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు. వారి దరఖాస్తులను త్వరలోనే పరిశీలించి, అర్హులైన వారందరికీ ఇదే విధంగా బహిరంగ సభ ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందిస్తామని ప్రకటించారు. సింగరేణి యాజమాన్యాన్ని ఈ దిశగా సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఆదేశించామని అన్నారు.

సింగరేణిని ఏ శక్తుల చేతుల్లోకీ వెళ్లనివ్వం!

?ప్రజా ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని సింగరేణిని దోపిడీ చేసే ప్రభుత్వం కాదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, సిఎల్పీ లీడర్‌గా ఆదిలాబాద్ జిల్లాలో చేసిన సుదీర్ఘ పాదయాత్రను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

పాదయాత్ర సమయంలో బొగ్గు గనులను సందర్శించి, కార్మికుల గుండె చప్పుళ్లను స్వయంగా విన్నానని చెప్పారు. ఆనాడే కార్మికులకు మాట ఇచ్చాను---రాబోయేది ఇందిరమ్మ రాజ్యమని, సింగరేణి సంస్థను తెలంగాణ ప్రజల ఆస్తిగా కాపాడుకుంటామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఏ దోపిడీదారుల కబంధ హస్తాల్లోనూ, డేగలు.. రాబందులు చేతుల్లోనో సింగరేణిని పడనీయమని డిప్యూటీ సీఎం విస్పష్టంగా ప్రకటించారు.

దేశ చరిత్రలోనే తొలిసారిగా రూ. 1.25 కోట్ల ప్రమాద బీమా

కార్మికుల ఆరోగ్యం, భద్రతపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని దేశంలోని మరే ప్రభుత్వానికి లేదని ఆయన పునరుద్ఘాటించారు. దేశంలో ఏ సంస్థలోనూ లేని విధంగా సింగరేణి కార్మికులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ. 1 కోటి 25 లక్షల ప్రమాద బీమాను అందిస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ పథకం కింద ఇప్పటికే దాదాపు రూ. 40 నుంచి 45 కోట్ల విలువైన చెక్కులను బాధితులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం నియామక పత్రాల పంపిణీ మాత్రమే కాదని, కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న నమ్మకం, భరోసా, ధైర్యమని భట్టి విక్రమార్క చెప్పారు. సింగరేణి సంస్థను గత పదేళ్లుగా దోపిడీ చేసిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ధ్వజమెత్తారు. పొద్దున లేస్తే సాయంత్రం వరకు రోజుకో కట్టుకథ అల్లుతూ, సొంత మీడియా సంస్థల ద్వారా అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి కార్మికులకు రూ. 10 లక్షల వరకు మెగా హెల్త్ ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. గతంలో బోనస్ పంపిణీ చేసేటప్పుడు కేవలం 40,000 మంది పర్మనెంట్ ఉద్యోగులకే ఇచ్చేవారన్నారు. మిగతా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సహాయం బోనస్ అందించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది. సింగరేణి చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 30,000 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు తలా ?5,000 చొప్పున బోనస్ ప్రకటించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. ఇలాంటి నిర్ణయం తీసుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు.

సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ చేస్తోంది" అంటూ బీఆర్ఎస్ నేత హరీష్ రావు చేస్తున్న ఆరోపణలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. నేను సూటిగా అడుగుతున్నాను.. ఇవాళ సింగరేణికి నష్టం చేసింది ఎవరైనా ఉన్నారంటే అది కేవలం బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం మాత్రమే అని చెప్పారు. 135 సంవత్సరాల క్రితం ఖమ్మం జిల్లాలో ప్రారంభమైన సింగరేణి సంస్థకు, 2014 లో టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చేంతవరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని కోల్ బ్లాకులన్నీ సింగరేణికే అప్పగించేవారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక సింగరేణికి రావలసిన కోల్ బ్లాకులు రాకుండా కుట్రపూరితంగా అడ్డుకున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ?దొంగే దొంగ అన్నట్లుగా బీఆర్ఎస్, బీజేపీ నాటకాలు ఆడుతున్నాయని అన్నారు. ?సింగరేణిలో బొగ్గు కదలాలన్నా అత్యంత పటిష్టమైన నిఘా వ్యవస్థ ఉందని, అలాంటి సంస్థపై అబండాలు వేస్తూ నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి పరిధిలోని కోల్ బ్లాకులను తమకు అనుకూలమైన ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే దుర్మార్గపు కుట్రతోనే బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆరోపించారు.

హరీష్ రావు ఒక లేఖ రాస్తారు.. ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించి మాట్లాడుతుంటారని.. వీరిద్దరి మధ్య ఉన్న అంతర్గత బంధాన్ని ఎండగట్టారు. ?తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఆస్తుల, వనరుల దోపిడీని గమనించే, అసెంబ్లీ ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించారని.. ఇప్పటికైనా అబద్ధాల ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. పదేళ్లు మంత్రిగా చేసిన హరీష్ రావు తన మంత్రి హోదాను మరిచిపోయి రోజుకో అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

మిగతా 2లో

## విజయవంతంగా కొనసాగుతున్న "జ్ఞాన చైతన్య బస్సు యాత్ర" -- ఎంపీ డాక్టర్ మల్లు రవి



నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి చేపట్టిన "జ్ఞాన చైతన్య బస్సు యాత్ర" వనపర్తి నియోజకవర్గంలో జెండా ఊపి ప్రారంభించిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మున్సిపల్ చైర్మన్ మాదవి రమేష్ శెట్టి ఈ సందర్భంగా డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఈడబ్ల్యూఎస్ వర్గాలు మరియు ఇతర బడుగు, బలహీన వర్గాల ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయడం కాంగ్రెస్ పార్టీ యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత మరియు సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ జ్ఞాన చైతన్య బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు తమ హక్కుల పట్ల చైతన్యవంతులై ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక సమానత్వం సాధన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల హక్కుల సాధనలో ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ జ్ఞాన చైతన్య బస్సు యాత్ర ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు రాజ్యాంగ హక్కులు, విద్యా అవకాశాలు, ఉపాధి పథకాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని యాత్రకు తమ మద్దతు తెలిపారు.



ప్రజాబలం

14 జూన్ 2026 ఆదివారం

# దిగొస్తున్న బంగారం ధరలు

బంగారం ధరలు పతనమన్న వార్త మధ్యతరగతి ఇళ్లల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళల మొహాల్లో వెయ్యి వాట్ల బల్బు వెలిగినంత హ్యాపీనెస్ జిగేల్‌మంటోంది. మగవారికి జీతం పెరిగినప్పుడు వచ్చే సంతోషం ఒకెత్తయితే..మహిళలకు బంగారం ధర తగ్గినప్పుడు వచ్చే ఆనందం ఇంకో ఎత్తు. ఎందుకంటే, మధ్యతరగతి మహిళల దృష్టిలో బంగారం అనేది కేవలం ఒక నగ కాదు..అది వారి కష్టార్జితం, దాచుకున్న రహస్య పొదుపు, ఆపదలో ఆదుకునే ఒక నమ్మకం. నెలనెలా దాచుకున్న చిట్టీ డబ్బులు తీసి ఓ చిన్న ముక్కుపుడకో, ఉంగరమో కొనడం ఆడవాళ్లు ఆర్థికభద్రతగా భావిస్తారు. బంగారం ధర పది రోజుల్లో ఏకంగా 10 వేల 690 రూపాయలు తగ్గింది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం లక్షా 45 వేల 640కి దిగి వచ్చింది. ఒక్కరోజులోనే 2 వేలకు పైగా తగ్గింది. కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్రంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. 2026 ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో రికార్డ్ స్థాయిలో ఒక ఔన్స్ బంగారం ధర దాదాపు 5,500 నుంచి 5,600 డాలర్ల దగ్గర ఆల్‌టైమ్ హైని తాకింది. కానీ, గడిచిన కొన్ని వారాల్లోనే అది ఏకంగా 4,200 డాలర్ల స్థాయికి పడిపోయింది. అంటే దాదాపు 15 నుంచి 20 శాతం వరకు క్షీణత. ఇరాన్ యుద్ధం మళ్లీ ఉద్రిక్తతలను పెంచుతోంది. ద్రవ్యోల్బణం భయపెడుతోంది.. అయినా సరే, సేఫ్ హెవెన్ గా భావించే బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి.. దీని వెనుక గ్లోబల్ ఎకనామిక్ గేమ్ ఏంటన్న విశ్లేషణ సాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 15శాతానికి పైగా తగ్గితే, ఇండియాలో కేవలం 4 నుంచి 5 శాతమే తగ్గాయి. దీనికి కారణం మన రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడటం. అలాగే 2026 మేలో భారత ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి 15శాతానికి పెంచడం. ఈ డ్యూటీ పెంపుతో మన దేశీయ మార్కెట్లో పూర్తి స్థాయిలో తగ్గుదల ప్రభావం కనిపించలేదు.ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది. డాలర్‌కు, గోల్డ్‌కు ఎప్పుడూ వ్యతిరేక సంబంధమే. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే బలంగా ఉంది. డాలర్ బలంగా మారినప్పుడు, ఇతర కరెన్సీలు ఉపయోగించే దేశాలకు బంగారం కొనడం ఖరీదైన వ్యవహారం. దీనివల్ల అంతర్జాతీయంగా పుత్తడికి డిమాండ్ తగ్గి, ధరలు తగ్గుముఖం పడతాయి. 2026 ప్రారంభంలో, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని అందరూ భావించారు. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ సీన్ రివర్స్ అయింది. అమెరికాలో ఇటీవల విడుదలైన ఉద్యోగాల గణాంకాలు చాలా బలంగా వచ్చాయి. దీనికి తోడు పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు పైపైకి ఎగబాకాయి. చమురు పెరగడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భయాలు మొదలయ్యాయి. ఫలితంగా, యూఎస్ ఫెడ్ తన వడ్డీ రేట్ల కోతను సెప్టెంబర్ 2026 లేదా ఆ తర్వాతకు వాయిదా వేసింది. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నంత కాలం, పెట్టుబడిదారులు బంగారాన్ని వదిలి బాండ్లపై దృష్టి పెడతారు. ఎందుకంటే బంగారం ఎలాంటి వడ్డీని ఇవ్వదు, కానీ యూఎస్ బాండ్లు ప్రస్తుతం దాదాపు 1.74శాతం రియల్ ఈల్డ్‌ను అందిస్తున్నాయి. దీంతో గోల్డ్ డిమాండ్ తగ్గి?రేట్లు డౌనయ్యాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లేటెస్ట్ రిపోర్ట్ ప్రకారం, 2026 మొదటి క్వార్టర్‌లో సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు దాదాపు 22శాతం తగ్గాయి. బంగారం ధరలు విపరీతమైన గరిష్ట స్థాయికి చేరడంతో, బ్యాంకులు కూడా కొత్త కొనుగోళ్లను కాస్త ఆపి, ప్రాఫిట్ బుకింగ్ వైపు మొగ్గు చూపాయి. అలాగే రష్యా సెంట్రల్ బ్యాంకు కూడా భారీగా భౌతిక బంగారం అమ్మేసుకుంటోంది. ఉక్రెయిన్ నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా?వార్‌ను కంటిన్యూ చెయ్యడానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి గోల్డ్ వదిలించుకుంటోంది. ఈ నాలుగు నెలల్లో సుమారు 30 టన్నుల గోల్డ్‌ను సెల్ చేసింది.ఫిజికల్ గోల్డ్ కు డిమాండ్ తగ్గడం కూడా రేట్ల పడిపోవడానికి మరో కారణం. భారత్, చైనా వంటి దేశాల్లో ఆభరణాల డిమాండ్ గణనీయంగా పడిపోయింది. 2025, 2026 లలో ధరలు లక్షన్నర దాటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనడం తగ్గించేశారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ, లైట్ వెయిట్ జ్యువెలరీ లేదా పాత బంగారాన్ని మార్పిడి చేసుకోవడం పెరిగింది. మన దేశంలో బంగారం ధర పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ మీద మాత్రమే ఆధారపడి ఉండదు. కొన్ని లోకల్ ఫ్యాక్టర్స్ పనిచేస్తాయి. డాలర్-రూపాయి మార్పిడి రేటు అందులో ఒకటి. డాలర్ ఇండెక్స్ పెరగడం వల్ల రూపాయి విలువ దాదాపు 95 రూపాయల మార్కును దాటి వెళుతోంది. రూపాయి బలహీనపడితే మనం దిగుమతి చేసుకునే బంగారం ఖరీదవుతుంది. దిగుమతులు కూడా తగ్గుతాయి. డిజిటల్ గోల్డ్, ఇటిఎఫ్‌ల ట్రెండ్ బాగా పెరిగింది. భౌతిక బంగారం కంటే ఇప్పుడు యువత గోల్డ్ ఇటిఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ధరలు భారీగా పెరగడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. డిమాండ్ సప్లై సూత్రం ప్రకారం?డిమాండ్ డౌనయ్యింది?రేటు దిగొచ్చింది. దేశంలో విదేశీ మారక నిల్వలను కాపాడటానికి ఒక్క ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనడం ఆపాలని ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను కోరారు. పశ్చిమ ఆసియా యుద్ధంతో చమురు ధరలు పెరిగాయని?ఆయిల్ కొనడానికి డాలర్లు కావాలి కాబట్టి.. బంగారం దిగుమతులు తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ ప్రకటన వచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి ఏకంగా 15శాతానికి పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. సుంకం పెరగడం వల్ల విదేశాల నుంచి అధికారికంగా బంగారం దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇది దేశీయంగా బంగారం కొత్త కొనుగోళ్లను చాలా వరకు నియంత్రించింది. మోడీ పిలుపునిచ్చిన 10 రోజుల్లోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జ్యువెలరీ షాపుల్లో సేల్స్ 80శాతం పడిపోయాయి. కస్టమర్ల ఆలోచనాధోరణి కూడా కొంత మారిందని కొందరు బులియన్ మార్కెట్ నిపుణుల అభిప్రాయం. 10 మందిలో ఆరుగురు ఈ ఏడాది బంగారం కొనకూడదని ఫిక్స్ అయ్యారు.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం.. భారతదేశంలో 2025లో డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు 69 శాతం పెరిగి 13.5 టన్నులకు చేరుకున్నాయి. ఇదే సమయంలో యూపీఐ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్ల విలువ భారీగా పెరిగింది. 2025 జనవరిలో సుమారు ఎనిమిది వందల కోట్లుగా ఉన్న లావాదేవీలు? డిసెంబరు నాటికి 21 వందల కోట్లకుపైగా చేరినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే 2025 ఆగస్టు నాటికి డిజిటల్ గోల్డ్ లావాదేవీల సంఖ్య 377 శాతం పెరగడం? ఈ రంగం విస్తరిస్తున్న వేగాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఈ పెట్టుబడి విధానాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నట్లు చెబుతున్నారు మార్కెట్ నిపుణులు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగానే మొబైల్ ఫోన్‌లో కొన్ని క్లిక్‌లతో బంగారం కొనుగోలు చేయగలగడంతో? పెట్టుబడులు ఈజీ అవుతున్నాయి.

# బీఆర్ఎస్, బీజేపీలు లోలోపల ఒక్కటే

మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వాల నిర్వాకం, కొందరు నేతల స్వార్థ ప్రయోజనాల వల్ల తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థకు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. సింగరేణి సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడం వల్ల సంస్థకు జరిగిన నష్టాన్ని గణాంకాలతో ఆయన లెక్కలతో సహా వివరించారు. కోయగూడెం బ్లాక్ వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల దాదాపు 67 మిలియన్ టన్నుల బొగ్గును సంస్థ కోల్పోయిందని చెప్పారు. దీని మార్కెట్ విలువ దాదాపు 29,106 కోట్లు ఉంటుందని, తద్వారా సింగరేణికి రావాల్సిన 19,360 కోట్ల లాభం చేజారిపోయిందని మండిపడ్డారు. ఈ బ్లాక్‌ను ఒక ప్రైవేట్ వ్యక్తికి కట్టబెట్టారని విమర్శించారు. సత్తుపల్లి బ్లాక్-6 కు ఆనుకుని ఉన్న సత్తుపల్లి బ్లాక్-3 వేలంలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుపడ్డారని ఆయన ఆరోపించారు.

?ఎనిమిదేళ్ల కాలంలో మైనింగ్ చేసుకునే అవకాశం ఉన్న ఈ బ్లాక్‌లో దాదాపు 32 మిలియన్ టన్నుల బొగ్గు అందుబాటులో ఉందన్నారు. సింగరేణి ఇందులో పాల్గొనకపోవడం వల్ల ఉత్పత్తి లేక ?10,032 కోట్ల రెవెన్యూ నష్టం వాటిల్లిందని ఆయన చెప్పారు. ?దీని ద్వారా రావాల్సిన ?2,624 కోట్ల నికర లాభాన్ని సింగరేణి నష్టపోయిందన్నారు.

ఈ రెండు బ్లాకులను దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులకు అక్కడ మైనింగ్ చేసే సామర్థ్యం, స్థలం లేవని అన్నారు. కేవలం సింగరేణిని నష్టపరచడానికే ఈ కుట్ర చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలం నిబంధనల ప్రకారం బ్లాకులు దక్కించుకున్న వారు మైనింగ్ చేయలేకపోతున్నారు. పైగా సమయం ముగిసిపోయింది. మరి ఆ బ్లాకులను తిరిగి సింగరేణికే కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డిని నేను రాతపూర్వకంగా కోరాను. తెలంగాణ ప్రతినిధిగా ఉన్నా.. ఆ బ్లాకులను సింగరేణికి ఎందుకు ఇప్పించలేకపోతున్నారు?" అని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తీవ్ర స్వరంతో ప్రశ్నించారు.

గత బీఆర్ఎస్ నాయకత్వం, బీజేపీ ఇద్దరూ కలిసి సింగరేణిపై కుట్రలు చేస్తూ, ఇప్పుడు దొంగే దొంగ అన్నట్టుగా నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈ కుట్రలను చూస్తూ ఊరుకోదని, సింగరేణి ఆస్తులను, వనరులను నిటారుగా నిలబడి కాపాడుతామని నిండు సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు

సింగరేణి సంస్థను కాపాడుకోవడమే కాకుండా, కార్మికుల న్యాయబద్ధమైన హక్కులన్నింటినీ ఈ ప్రజా ప్రభుత్వం నిలబెడుతుందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కొద్దిరోజులుగా జరుగుతున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ, కార్మిక లోకానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.

ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు దేశంలోని ప్రజాస్వామ్యవాదులందరికీ ఒక పెద్ద హెచ్చరిక అని డిప్యూటీ సీఎం చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసి ఎలాగైనా గెలవాలనుకునే వారికి ఇది ఒక ప్రమాద ఘంటిక అని ఆయన పేర్కొన్నారు. అత్యంత జాగరూకతతో వ్యవహరించి, ప్రజాస్వామ్యాన్ని, ఇక్కడి ఆస్తులను, వ్యవస్థలను కబళించి అన్యాయం చేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీని గాని, వారితో మిలాఖత్ అయి తెలంగాణ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాలని చూస్తున్న బిఆర్ఎస్ పార్టీని ఉపేక్షిస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

వేలాది మంది కార్మికుల చెమట, శ్రమ పునాదులపై నిర్మించబడిన సింగరేణి సౌధాన్ని కూల్చాలని హరీష్ రావు, కిషన్ రెడ్డిల ఆధ్వర్యంలో కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రజల వారసత్వ సంపద అయిన సింగరేణిని కేంద్ర ప్రభుత్వం తన గుప్పెట్లోకి తీసుకోవాలని చూస్తోందని, దీనిపై కార్మికులు అత్యంత జాగ్రత్తగా ఉండి వాస్తవాలను గ్రహించాలని కోరారు.

సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించిన సమస్యలపై తక్షణమే నిర్ణయం తీసుకుని, ఈరోజు 335 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించామని చెప్పారు. భవిష్యత్తులోనూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

సింగరేణిలో మెడికల్ ఇన్వాలిడేషన్ అనేది కార్మికుల హక్కు అని, దాన్ని కాదనడానికి ఎవరికీ వీల్లేదని స్పష్టం చేశారు. దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను అరికట్టడానికి, ఈ ప్రాంత మంత్రులు, శాసనసభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, కార్మికుల అసలు సమస్యలను చర్చించినట్లు తెలిపారు. తక్షణమే న్యాయబద్ధంగా మెడికల్ ఇన్వాలిడేషన్ బోర్డును ప్రారంభించి, చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు.

సింగరేణిలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 'మారుపేర్ల' సమస్యపై లోతుగా అధ్యయనం చేసి, భవిష్యత్తులో ఎలాంటి లీగల్ ఇష్యూస్ రాకుండా ఉండేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కమిటీలో కేవలం అధికారులే కాకుండా, కార్మిక యూనియన్లకు సంబంధించిన ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ కమిటీ కూలంకషంగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఖచ్చితంగా ఒక న్యాయబద్ధమైన నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

సింగరేణి కాలరీస్‌కు సంబంధించిన బోర్డు స్వయం ప్రతిపత్తి కలిగిన బోర్డు అని ఆయన గుర్తుచేశారు. వారి రోజువారీ నిర్ణయాలలో, కార్యకలాపాలలో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోదని, ప్రభుత్వానికి దాంతో సంబంధం ఉండదని వివరించారు. దాదాపు 135 సంవత్సరాల క్రితం నిర్ణయించుకున్న నిబంధనల ప్రకారం, ఆ బోర్డు తన స్వయం ప్రతిపత్తితోనే సింగరేణి అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

సింగరేణి కాలరీస్ సంస్థ తెలంగాణ ప్రజల సొంత వనరు అని, ఇది అద్భుతమైన ప్రభుత్వ రంగ సంస్థ అని ఆయన చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన దోపిడీని అరికట్టి, సంస్థను పటిష్టమైన పునాదులపై నిలబెడతామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడంలో ఈ ప్రజా ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదని భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సొంత వనరైన సింగరేణిని, ఇక్కడి ప్రజలకే చెందేలా పటిష్టమైన పునాదులు వేస్తాం. ఈ ప్రజా ప్రభుత్వం ఉన్నంత కాలం.. పొరపాటున కూడా ఇందులోకి గద్దల్ని, డేగల్ని, దళారుల్ని, దోపిడీదారుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంకరేజ్ చేయదు, రానివ్వదు. సింగరేణి కాలరీస్‌ను నిలబెట్టడం కోసమే ఈ ప్రభుత్వం నిలబడుతుంది" అని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యయుతంగా సమస్యల పరిష్కారం

భవిష్యత్తులో కార్మికులకు గానీ, యాజమాన్యానికి గానీ ఎలాంటి సమస్యలు తలెత్తినా వాటిని అత్యంత ప్రజాస్వామ్యయుతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


అవసరమైతే ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, ఆ కమిటీలలో కార్మికులను భాగస్వాములను చేస్తామని పేర్కొన్నారు.

కార్మికుల భాగస్వామ్యంతో కూడిన ఒక విధానపరమైన నిర్ణయాన్ని ఆలోచించి, స్పష్టంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే.. దాన్ని అత్యంత ప్రజాస్వామ్యయుతంగా అమలు చేయడానికి

# గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట- మంత్రి జూపల్లి

## రూ.46 లక్షలతో నూతన భవనం ప్రారంభం..
## బజార్‌హత్నూర్ రూ.39 లక్షల భవనానికి శంకుస్థాపన





**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** జూన్ 13, 2026-ఆదిలాబాద్ జ్ఞాన సముపార్జనలో గ్రంథాలయాల పాత్ర కీలకమని, విద్యార్థులు, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. శనివారం జిల్లాలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో రూ.46 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన మొదటి అంతస్తు భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో రూ.39 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రంథాలయ భవనంలోని సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాలు సమాజానికి జ్ఞాన కేంద్రాలుగా నిలుస్తాయని, ప్రజల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు, గ్రంథాలయ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ లిక్కర్ రవాణా కుంభకోణం: లగ్జరీ కారు, రోలెక్స్ వాచీలు స్వాధీనం

విజయవాడ, జూన్ 13 ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణానికి అనుబంధంగా జరిగిన మద్యం రవాణా టెండర్ల స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో చేపట్టిన సోదాల్లో కీలక ఆధారాలు లభించాయి. గురువారం నిర్వహించిన ఈ దాడుల్లో ఒక లగ్జరీ కారుతో పాటు రూ. 94.5 లక్షల విలువైన ఖరీదైన గడియారాలు, లెక్కల్లో చూపని నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు ఈడీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేశిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కేశిరెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, విజయ నరసింహారెడ్డి, వల్లు సందీప్, కరుమూరి నాగేశ్వరరావు, కరుమూరి సునీల్ కుమార్‌లకు చెందిన ఐదు ప్రాంగణాల్లో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద జాయింట్ వెంచర్ ఒప్పందాలు, లెక్కల్లో చూపని నగదు లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఆస్తుల డాక్యుమెంట్లు తదితర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది.ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు రాజ్ కేశిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్) మాజీ మేనేజింగ్ డైరెక్టర్ వాసుదేవ రెడ్డిని ఈడీ అరెస్టు చేసింది. వారిని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో హాజరుపరచగా, జూన్ 25 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కుంభకోణానికి రాజ్ కేశిరెడ్డి ప్రధాన సూత్రధారిగా వ్యవహరించినట్లు ఈడీ గుర్తించింది. ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా ఉన్న సమయంలో తన రాజకీయ, పరిపాలనా ప్రభావాన్ని ఉపయోగించి, అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవ రెడ్డి, అతని సన్నిహితుడు తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి మద్యం రవాణా టెండర్ల విధానాన్ని తమకు అనుకూలంగా మలచుకున్నారని ఆరోపించింది.ఈ కేసులో ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అదనపు ప్రధాన కార్యదర్శి (విజిలెన్స్) ఫిర్యాదు మేరకు నమోదైన ఈ కేసులో ప్రభుత్వ ఖజానాకు రూ. 195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

## ఇంటర్నేషనల్ డాక్టర్స్ డేకు డాక్టర్ వేణు గోపాల చారిని ఢిల్లీకి ఆహ్వానించిన ఆది లీల ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఆదినారాయణ



హైద్రాబాద్ జూన్ 13 :జూలై 1న ఢిల్లీలో ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే ఉత్సవాలకు ఆది లీల ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఆదినారాయణ డాక్టర్ వేణు గోపాల చారిని స్వయంగా కలిసి ఆహ్వానించారు వివిధ రాష్ట్రాల లో సేవలందిస్తున్న వైద్యులను సత్కరిస్తున్న సందర్భంగా నాయకుడు మరియు వైద్యుడైన వేణుగోపాల చారి గారిని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించడం జరిగిందని డాక్టర్ ఆదినారాయణ తెలిపారు ఈ కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు ఆదిలీల ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వీర బొమ్మ రమేష్ మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు కేబీ శ్రీధర్ సామాజికవేత్త కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## 15 న ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీ యందు రక్తదాన శిబిరం



వికారాబాద్ జూన్ 13 : ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 15వ తారీకు నాడు అనగా సోమవారము ఉదయము తాండూరులోని బెల్కటూర్ యందుగల ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీ యందు స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి తెలిపారు. సుమారు 250 మంది స్వచ్ఛంద రక్తదాతలు తమ రక్తాన్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చారని, ఆ రక్తాన్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి తాండూరు లోని రక్త నిధి కేంద్రానికి మరియు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్ యందు గల రక్త నిధి కేంద్రము వారు పాల్గొని ఆ రక్తాన్ని సేకరిస్తారని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా ఈ మెగా రక్తదాన శిబిరానికి స్వచ్ఛంద రక్త దాతలు పాల్గొని ఈ కార్యక్రమమును జయప్రదం చేయవలసినదిగా సాయి చౌదరి కోరారు.

# 12 ఏళ్ల ప్రధాని మోదీ పాలన చారిత్రాత్మకం

### 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనే లక్ష్యం.

### బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్




**మలక్‌పేట్ ప్రజాబలం ప్రతినిధి** హైద్రాబాద్ జూన్ 13 : గడిచిన 12 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై తిరుగులేని గౌరవాన్ని, శక్తివంతమైన గుర్తింపును సాధించిందని బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్ అన్నారుభాగ్యనగర్ జిల్లా -- మలక్‌పేట్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు భారతదేశ ప్రగతికి తీసుకున్న కీలక నిర్ణయాల గురించి మీడియా సమావేశం లో వివరించారు.

అలాగే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వెల్లడించారు.

గతంలో అంతర్జాతీయ వేదికలపై భారత్ మాటలకు ప్రాధాన్యత ఉండేది కాదు.. నేడు ప్రపంచదేశాలన్నీ భారత్ వైపు చూస్తు న్నాయి. 12ఏళ్ల ప్రధాని మోదీ పాలన చారిత్రాత్మకం – 2047నాటికి'వికసిత్ భారత్' సాధనే లక్ష్యం.

ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజలచే ఎన్నికై, అత్యంత సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసిన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించారని, ఇది సామాన్యమైన విజయం కాదని, ప్రజల అచంచల విశ్వాసానికి ప్రతీక అని కొనియాడారు. అంతర్జాతీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా మోదీ గుర్తింపు పొందారని పేర్కొంటూ, మోదీ నేతృత్వంలోని గడిచిన 12 సంవత్సరాల కాలం దేశ ప్రగతిలో, సంస్కరణల పరంగా చారిత్రాత్మకమైనవని, 2047 నాటికి భారతదేశం ఖచ్చితంగా 'వికసిత భారత్'గా మారి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు భారతదేశ ప్రగతికి తీసుకున్న కీలక నిర్ణయాల గురించి వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వెల్లడించారు.

ఒక నమ్మకమైన నాయకుడికి ఉండాల్సిన నాలుగు గుణాలు---పారదర్శకత (ఇంటిగ్రిటీ), నిజాయితీ, పని చేసే సామర్థ్యం, ఇచ్చిన హామీలను ఫలితాలుగా మార్చే నైపుణ్యం---ప్రధాని మోదీ లో సంపూర్ణంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

బీజేపీ వచ్చే ఎన్నికల కోసం కాకుండా, రాబోయే తరం (నెక్స్ట్ జనరేషన్) భవిష్యత్తు కోసం ఆలోచిస్తుందని అన్నారు.

ముస్లిం మహిళల జీవితాల్లో శాపంగా మారిన తీన్ తలాక్ సామాజిక దురాచారాన్ని చట్టబద్ధంగా రద్దు చేశామని, వక్ఫ్ చట్టాల్లో అవసరమైన సంస్కరణలను విజయవంతంగా తీసుకువచ్చామని డాక్టర్ ప్రభ గౌడ్ చెప్పారు. కొత్త పార్లమెంట్ భవనంలో చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే చారిత్రాత్మక బిల్లును తీసుకువచ్చామని, మహిళలకు పూర్తి భాగస్వామ్యం, హక్కులు దక్కే వరకు తాము విశ్రమించబోమని, ఇది మోదీ ప్రభుత్వ గ్యారెంటీ అని స్పష్టం చేశారు. గడిచిన 12 ఏళ్లలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆపద్బాంధవుడిగా, విశ్వబంధువుగా నిలిచిందని అన్నారు. 'వసుధైక కుటుంబకం' అనే సందేశాన్ని కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపిన దేశం భారతదేశం అని, కోవిడ్ సంక్షోభ సమయంలో ప్రపంచవ్యాప్తంగా అవసరమైన వ్యాక్సిన్లలో 60% మనదేశంలోనేతయారయ్యాయని, 'వ్యాక్సిన్ మైత్రి' ద్వారా 100కు పైగా దేశాలకు 30 కోట్లకు పైగా కోవిడ్ వ్యాక్సిన్లను పంపిణీ చేశామని చెప్పారు.

గత ప్రభుత్వాల హయాంలో ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారారని, కానీ తమ అంత్యోదయ విధానం వల్ల గత 12 ఏళ్లలో 25 కోట్ల మంది దేశ ప్రజలను పేదరిక రేఖకు ఎగువకు తీసుకువచ్చామని, అంతర్జాతీయ సంస్థల నివేదికలే దీనిని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. సమానత్వం (ఈక్వాలిటీ) విషయంలో ప్రపంచంలో భారత్ నేడు నాల్గవ స్థానానికి చేరిందని, రాబోయే 5 నుండి 8 ఏళ్లలో భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందని నొక్కి చెప్పారు.

గతంలో బ్యాంకు ఖాతా తెరవాలంటె సిఫార్సులు, సాక్ష్యాలు కావాల్సి వచ్చేదని, మోదీ గారు వచ్చాక 56 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు తెరిపించారని, ఇప్పుడు బ్యాంకే ప్రజల ఇంటి వద్దకు వస్తోందని అన్నారు. దీనివల్ల ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా ఢిల్లీ నుండి పంపిన సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతోందన్నారు. గ్రామీణ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ దేశంలో 12 కోట్లకు పైగా మరుగుదొడ్లను నిర్మించామని, 2019లో జల్ జీవన్ మిషన్ ప్రారంభించినప్పుడు కేవలం 17% ఇళ్లకు మాత్రమే సురక్షితమైన తాగునీరు అందుతుండగా, ఈరోజు ఆ సంఖ్య 82%కి చేరిందని, కోట్లాది మంది మహిళలకు నీటి కోసం మైళ్ల దూరం నడిచే కష్టం తప్పిందని పేర్కొన్నారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా కోట్లాది ఇళ్లను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేశామని, ఉజ్వల యోజన ద్వారా పొగ నుండి విముక్తి కల్పించామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని వివరించారు. రాజులమని భావించే కాంగ్రెస్ నాయకులకు పేదరికం, గ్రామీణ బాధలు ఎప్పటికీ అర్థం కావని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మరియు పార్టీ నాయకులుగా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ గారు, పార్టీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుకర్ రెడ్డి , సురేందర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరేందర్ యాదవ్ , కార్యక్రమ సమన్వయకర్త నరసింహ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను శిక్షించాలి

### టి ఎన్ టి యుసి రాష్ట్ర నాయకులు కొలను వేణుగోపాల్ రెడ్డి




మునుగోడు జూన్ 13;నల్లగొండ జిల్లా కేంద్రంలో ఇటీవల ఎన్టీఆర్ విగ్రహానికి ఈ నెల 5న రాత్రి నిప్పు పెట్టిన దుండగులను శిక్షించాలని టి ఎన్ టి యుసి రాష్ట్ర నాయకులు కొలను వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటన చాలా విచారకరమని, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించి వారి అభివృద్ధి కోసం కృషి చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పుపెట్టడం భాదాకరమన్నారు. ఉమ్మడి నల్లగొండకు ప్రత్యేకస్థానం కల్పించిన వ్యక్తి అని కొనియాడారు. నిప్పుపెట్టిన దుండగులను పట్టుకొని విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## వికసిత్ భారత్-2047 బిజెపి లక్ష్యం

### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి





**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:**హైద్రాబాద్ జూన్ 13 :వికసిత్ భారత్-2047 లక్ష్య సాధన కోసం ప్రధాని మోడీ నిరంతరం కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి పేర్కొన్నారు. దేశంలో బలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, పేదరిక నిర్మూలన, సమగ్ర అభివృద్ధితో పాటు నాణ్యమైన విద్య, వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే మోదీ ధ్యేయమని ఆమె అన్నారు. బీజేపీ గోల్కొండ జిల్లా ఆధ్వర్యంలో శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నరేంద్ర మోదీ 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా, గత 12 సంవత్సరాలుగా దేశ ప్రధానమంత్రిగా సేవలందిస్తూ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారని తెలిపారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశ నవనిర్మాణానికి దోహదపడే అనేక సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను మోదీ అమలు చేశారని ఆమె కొనియాడారు. మోదీ కేవలం ప్రధానమంత్రిగా కాకుండా దేశానికి 'ప్రధాన సేవకుడు'గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మోదీ నాయకత్వం, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో కూడా బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికొదిలేసి, కిషన్ రెడ్డి పై పడి ఏడవడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని బంధకార్తీక మండిపడ్డారు.కేంద్రం ఇస్తున్న నిధులతోనే రాష్ట్రంలో రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. చిత్తశుద్ధి ఉంటే,కేంద్ర నిధులపై బహిరంగ చర్చకు రావాలని కార్తీక పిలుపునిచ్చారు.? కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలపై, నిరుద్యోగ భృతిపై ప్రజలు తిరగబడుతుంటే.. ఆ భయంతోనే సీఎం ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆమె ఎద్దేవాచేశారు.ఈకార్యక్రమంలో బిజెపి గోల్కొండ జిల్లా ప్రెసిడెంట్ ఉమామహేందర్,గోల్గొండ జిల్లా ప్రెస్ మీడియా కార్యదర్శి నటరాజ్ నామ్‌దారి బిజెపి సీనియర్ నేతలు సతీష్ సోలంకి,అల్లపురుషోత్తం సంజయ్,వెంకటెస్,షైలేందర్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం

కరీంనగర్ మంచిర్యాల జిల్లా పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో కరీంనగర్ చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొద్దిసేపు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆగారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి జిల్లాలోని తాజా పరిస్థితులు, జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు.

## విధి నిర్వహణలో లైన్మెన్‌కు విద్యుత్ షాక్

### పోల్‌పై నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలు

తిరుపతి వెంకటగిరి విద్యుత్ శాఖ పరిధిలో... విధి నిర్వహణలో ఉన్న జూనియర్ లైన్ మెన్ పోతన (23)కు విద్యుత్ షాక్ నిర్వహణలో ఉన్న ఓ లైన్మెన్‌కు విద్యుత్ షాక్ తగలడంతో విద్యుత్ స్తంభం (పోల్) పై నుంచి కిందపడిపోయి తీవ్రంగా గాయపడిన ఘటన వెంకటగిరి సబ్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గాయపడిన ఉద్యోగిని వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారుఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అయితే, సంబంధిత అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం, విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేయకుండా పనులు చేపట్టడం వంటి కారణాల వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని తల్లిదండ్రులు, స్థానికులు, ఆరోపిస్తున్నారు. లైన్మెన్ ప్రమాద ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులకు సంబంధిత ఉన్నతాధికారి సరైన సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగినప్పటికీ స్పందించకుండా తప్పించుకోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రమాదానికి గల కారణాలు, గాయపడిన ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి, భద్రతా నిబంధనలు పాటించారా లేదా అనే అంశాలపై స్పష్టత ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజలకు సమాచారం అందించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు మౌనం వహించడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఏపీలో 6, తెలంగాణలో 4..

## మూడు ముక్కలుగా లోక్‌సభ నియోజకవర్గాలు

విజయవాడ, జూన్ 13, దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తాజాగా నియోజకవర్గాల పునర్విభజన అంశానికి సంబంధించి కీలక ప్రతిపాదనలతో సిఫార్సులు చేసింది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 824 నియోజకవర్గాలకు పెంచాలని పేర్కొంది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ప్రస్తుతం ఉన్న 543 నియోజకవర్గాలలోని 59 స్థానాలను రెండుగా, 111 స్థానాలను మూడు నియోజకవర్గాలుగా విభజించాలని సూచించింది. నియోజకవర్గాల విభజనకు.. గత ఎన్నికల్లో పోలింగ్ శాతంతో పాటుగా పట్టణ, ఎస్సీ, ఎస్టీ, మహిళల జనాభా సహా పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచనలు చేసింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలు నియోజకవర్గాలు మూడుగా, రెండుగా విభజించాలని సూచించింది.ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, రాజంపేట, కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల నియోజకవర్గాలను మూడుగా, మచిలీపట్నం నియోజకవర్గాన్ని రెండుగా చేయాలని సూచించింది. తెలంగాణ విషయానికి వస్తే.. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కా?జ్‌గిరి, మెదక్‌లను మూడుగా, చేవెళ్లను రెండుగా విభజించాలని సిఫార్సు చేసింది. దీని ప్రకారం నియోజకవర్గాలను విభజన వల్ల 2.32% ఓటింగ్ పెరుగుతుందని.. 2.23 కోట్ల మంది అదనంగా ఓటేస్తారని చెబుతున్నారు. తాజా సిఫార్సుల్ని బట్టి నియోజకవర్గాలను విభజిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 3.52%, తెలంగాణలో 6.55% ఓటింగ్ పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు. జనాభా, పట్టణీకరణ, ఎస్సీ జనాభా, ఎస్టీ జనాభా, భాషాపరమైన పోలరైజేషన్, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి మూడుగా విభజించే లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆరు నగరాలు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ నియోజకవర్గం భాషాపరమైన పోలరైజేషన్ స్కోర్ 0.12 ఉంది. హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉర్దూ మాట్లాడేవారు 10.66 లక్షలమంది ఉన్నారు.. తెలుగు మాట్లాడేవారు 28శాతం, హిందీ మాట్లాడేవారు 5.15శాతం ఉన్నారు. ఈ మేరకు హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని సిఫార్సు చేసింది. ఇలా భాషాపరమైన పోలరైజేషన్ ఉన్నచోట్ల ఓటింగ్ శాతం 11 నుంచి 13 శాతం అధికంగా నమోదవుతుందని భావిస్తున్నారు.. ఇక సికింద్రాబాద్‌లో పోలరైజేషన్ స్కోర్ (0.120)గా ఉంది. హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే.. ప్రతి నియోజకవర్గంలో 27.87 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. సికింద్రాబాద్‌ను మూడుగా విభజస్తే 26.93 పర్సంటేజ్ పాయింట్లు వస్తాయని భావిస్తున్నారు.ఏపీ విషయానికి వస్తే.. నంద్యాల (0.117), రాజంపేట (0.114), కడప (0.105), విశాఖపట్నం (0.052) పోలరైజేషన్ ఉంది. విశాఖపట్నం నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే 15.88 పర్సంటేజ్ పాయింట్లు, కడప నియోజకవర్గం విభజనతో 15.39 పర్సంటేజ్ పాయింట్లు, రాజంపేట 14.47 పర్సంటేజ్ పాయింట్లు, నంద్యాల 14.22 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల ప్రకారం పెద్ద రాష్ట్రాల్లో సీట్లు 50శాతం పెరగనున్నాయి. చిన్న రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను నేరుగా రెట్టింపు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణ లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు, కర్ణాటక సీట్లు 28 నుంచి 42కు, తమిళనాడు సీట్లు 39 నుంచి 59కి, కేరళ లోక్ సభ సీట్లు 20 నుంచి 30కి పెరుగుతాయి. అన్ని నియోజకవర్గాలను కాకుండా170 నియోజకవర్గాలను విభజిస్తే సరిపోతుందని సిఫార్సు చేశారు. అందుకే 59 నియోజకవర్గాలను రెండుగా.. 111 నియోజకవర్గాలను 3గా చేయాలని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందంటున్నారు.

## అగ్రికల్చర్ లోహాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానం..

అనంతపురం, జూన్ 13 ఉమ్మడి అనంతపురం జిల్లా.. కరవుకు కేరాఫ్ అడ్రస్.. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం. ఏళ్ల తరబడి కరువు కాటకాలు వేధిస్తున్నా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, భూమాతపై నమ్మకంతో వ్యవసాయాన్నే నమ్ముకుని ధైర్యంగా ముందడుగు వేసే రైతన్నలు ఎందరో. కానీ కాలం మారుతోంది. అనంత రైతులు టెక్నాలజీ బాట పడుతున్నారు. మూస ధోరణి వీడి.. సరికొత్త సాంకేతిక పద్ధతులతో సాగులో అద్భుతాలు చేస్తున్నారు. సంప్రదాయ విధానాలను పక్కనబెట్టి హార్టీకల్చర్, పండ్ల తోటల సాగులో రాణిస్తున్నారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానాన్ని ఎక్కువగా ఆఫ్రికా దేశాలలో ఉపయోగిస్తుంటారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాలలో ఈ విధానం ద్వారా వ్యవసాయం చేపడుతుంటారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ అంటే.. కొండకు వాలుగా ఉన్న పొలాలలో అర్ధ చంద్రాకారపు ఆకారంలో గుంతలు తవ్వడం. సాధారణంగా ఈ గుంతలు ఒకటి నుంచి రెండు మీటర్ల వ్యాసం కలిగి ఉంటాయి. ఈ విధంగా చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చు. అలాగే నేల సారవంతాన్ని పునరుద్ధరించవచ్చు. ఈ విధానం ద్వారా రైతులు భారీగా పెట్టుబడులు లేకుండానే బీడు భూములను పునరుద్ధరించుకోవచ్చు. ఇలా కొండకు వాలుగా గుంతలు తవ్వటం ద్వారా వర్షం కురిసినప్పుడు ఆ వర్షపు నీరు వీటిలో చేరి అక్కడే ఇంకిపోతుంది. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ విధానం అనుసరిస్తుంటారు.అలాంటి ఓ రైతే ప్రమీలమ్మ. ఆఫ్రికా దేశంలో అనుసరించే హాఫ్‌మూన్ విధానంతో గత ఎనిమిది సంవత్సరాలుగా పంటలు సాగు చేస్తూ రోజువారీ ఆదాయం పొందుతున్నారామె. తన సక్సెస్ స్టోరీతో ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి కూడా అభినందనలు అందుకున్నారు ప్రమీలమ్మ.కళ్యాణదుర్గం మండలంలోని భట్టువానిపల్లికి చెందిన ప్రమీలమ్మకు మూడు ఎకరాల పొలం ఉంది. అర ఎకరంలో ఏ – గ్రేడ్ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు ప్రమీలమ్మ. మిగతా రెండున్నర ఎకరాలలో వేరుసెనగ పంట పండిస్తున్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తూ రసాయనాలకు దూరంగా సొంతంగా తయారుచేసుకున్న జీవామృతాన్ని పిచికారీ చేస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఏ గ్రేడ్ విధానంలో సాగుచేసే ఆకుకూరలు, కూరగాయలతో రోజూ ఆదాయం పొందుతున్నారు. ఎలాంటి రసాయనాలు లేకుండా పూర్తిగా సేంద్రీయ విధానంలో పంటలు పండిస్తూ ఉండటంతో ప్రమీలమ్మ ఇంటివద్దకే వచ్చి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నారు. ఇక ప్రమీలమ్మ గురించి తెలిసిన సీఎం చంద్రబాబు జలహారతి కార్యక్రమంలో ఆమెను అభినందించారు.ఏ గ్రేడ్ సాగు అనేది ప్రకృతి వ్యవసాయంలో ఒక పద్ధతి. ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడితో, ఒకే సమయంలో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. ఒకే పొలంలో, ఒకే సమయంలో ప్రధాన పంటతో పాటుగా అనుబంధంగా మరో మూడు లేదా నాలుగు పంటలు సాగు చేయడాన్ని ఏ గ్రేడ్ మోడల్ అని పిలుస్తుంటారు. ఈ రకంగా వివిధ రకాల పంటలను పండించటం ద్వారా నేల సారం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. అలాగే అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే రోజూవారీ ఆదాయం కూడా పొందవచ్చని చెప్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఈ మధ్యకాలంలో ఈ విధానం పెరుగుతోంది.

## రాయలసీమలో లిమిటేషన్ రచ్చ

తిరుపతి, జూన్ 13, మరోసారి నియోజకవర్గాల పునర్విభజన అంశం తెరపైకి వచ్చింది. మొన్నటికి మొన్న మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లు వెనక్కి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో పునర్విభజన బిల్లును వెనక్కి తీసుకుంది కేంద్రం. అయితే ఎట్టి పరిస్థితుల్లో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గ రాజకీయ పరిస్థితులు కలిసి వస్తున్నాయి. బెంగాల్ తో పాటు తమిళనాడులో లోక్సభ సభ్యుల బలం ఎన్డీఏకు అదనపు బలంగా మారనుంది. ఈ పరిస్థితుల్లో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నిన్ననే తాజా వర్కింగ్ పేపర్ నియోజకవర్గాల పునర్విభజనపై విడుదల చేసింది. దేశవ్యాప్తంగా పార్లమెంట్ స్థానాలు పెరగడంతో పాటు ఏపీలో కూడా పెరిగే ఛాన్స్ ఉంది. ఇప్పుడు ఉన్న 25 పార్లమెంట్ స్థానాలకు గాను మరో పదమూడు సీట్లు పెరుగుతాయి. అయితే సింహభాగం పెరుగుదల అనేది రాయలసీమలో కావడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.కొంతకాలంగా తీవ్ర అధ్యయనం చేసిన ఈ ఆర్థిక మండలి తన నివేదికను బయటపెట్టింది. కొత్త ప్రతిపాదనలను పెట్టింది. వీటిని చూస్తే పునర్విభజనతో ఎక్కువగా లాభపడేది రాయలసీమ. అత్యంత ప్రతిష్టాత్మకమైన లోక్ సభ స్థానాలుగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, రాజంపేట నియోజకవర్గాల పరిధి చాలా పెద్దదిగా ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానాన్ని మూడు గా విభజిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అభిప్రాయపడింది. ఈ నాలుగు సీట్ల పరిధిలో మరో 8 పెరగనున్నాయన్నమాట. ఇదే జరిగితే భవిష్యత్తులో దేశ రాజకీయాలతో పాటు రాష్ట్రంలో అధికార పీఠాన్ని శాసించడంలో రాయలసీమ విపరీతమైన ప్రభావం చూపి అవకాశం ఉంది.రాయలసీమలో పునర్విభజనతో ఎనిమిది పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉంది. అయితే ఉత్తరాంధ్రలో మాత్రం కేవలం రెండు లోక్ సభ సీట్లు పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది. విశాఖ గ్లోబల్ సిటీగా మారుతున్న తరుణంలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని ఈ మండలి ప్రతిపాదించింది. అంటే విజయనగరం, శ్రీకాకుళంలో ఉన్న పార్లమెంట్ స్థానాలను యధాతథంగా ఉంచి.. విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి ఓ రెండు స్థానాలను విభజించి పెంచుతారు అనేది ఈ ప్రతిపాదనల సారాంశం. అయితే ఆశ్చర్యకరంగా రాష్ట్రంలో అత్యధిక జనాభా, రాజకీయ ప్రాధాన్యత కలిగిన కోస్తాంధ్ర, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మాత్రం ఇప్పుడున్న సీట్లను యధాతథంగా ఉంచాలని ఈ నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. కోస్తా జిల్లాల్లో జనాభా నియంత్రణ ప్రమాణాలు స్థిరంగా ఉండటం, నియోజకవర్గాల భౌగోళిక పరిమితులు ఓటర్ల సంఖ్యకు అనుకూలంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. 2027 జనాభా లెక్కల ప్రకారం ఈ పునర్విభజన చేపడితే రాజకీయంగా రాయలసీమ మరోసారి పై చేయి సాధించే అవకాశం ఉంది. దాదాపు 13 పార్లమెంటు స్థానాలు పెరగడంతో అన్ని పార్టీల్లో ఆశావహులకు అవకాశాలు దక్కుతాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# డేటా సెంటర్లు...

## 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ కు ప్లానింగ్

విశాఖపట్టణం, జూన్ 13, ఏపీలోని విశాఖపట్టణం డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతోంది. ఆ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే, డేటా సెంటర్లకు లోటులేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డేటా సెంటర్ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీర్ఘకాలిక పవర్ ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. రాబోయే పదేళ్లలో డేటా సెంటర్ల విద్యుత్ అవసరం దాదాపు 15 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం.. అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది.విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో డేటా సెంటర్లకు లోటు లేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రణాళికలపై చర్చించారు. విశాఖపట్టణం ప్రాంతంలో ప్రస్తుతం 16భారీ డేటా సెంటర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని ఏపీ ట్రాన్స్‌కో అంచనా వేసింది. వీటి ద్వారా సుమారు 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ ఏర్పడనుండగా.. అనుబంధ మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల అవసరాలను కలుపుకుని మొత్తం విద్యుత్ డిమాండ్ 2036-37 నాటికి 15 గిగా వాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ అవసరాలను తీర్చేందుకు 765 కేవీ, 400 కేవీ, 220 కేవీ స్థాయిల్లో ట్రాన్స్ మిషన్ నెట్ వర్క్ ను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు.ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ అభివృద్ధి కోసం పెందుర్తి, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవారిపాలెం వంటి కీలక సబ్ స్టేషన్లను అనుసంధానించేలా ఈ వ్యవస్థను నిర్మించనున్నారు. ఈ నెట్‌వర్క్ 2034 నాటికి 15 గిగావాట్లకుపైగా డేటా సెంటర్ లోడ్‌ను మోయగల సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. ఈ ప్రణాళికలో భాగంగా రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపైనా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ ప్రాంతంలో భారీ పెట్టుబడుల కోసం కొత్త 400 కేవీ, 200 కేవీ సబ్ స్టేషన్లతో పాటు అధిక సామర్థ్యం కలిగిన ప్రత్యేక విద్యుత్ ప్రసార మౌలిక వసతులు, ట్రాన్స్ మిషన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా తార్లువాడ, ముడసర్లోవ, పోలేపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ హబ్‌ల కోసం అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.గూగుల్, రిలయన్స్, టీసీఎస్ హైపర్‌వాల్ట్, సీటీఆర్ఎల్ఎస్ , జీఎంఆర్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయడంపై ఆసక్తి చూపుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ పెట్టుబడులు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని ప్రధాన డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా నిలబెడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## జగన్ కు పాజిటివ్ గా మారుతోందా..



విజయవాడ, జూన్ 13, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీలో పటిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. అది వచ్చే ఎన్నికల్లోనూ చెక్కు చెదరదన్న నమ్మకంతో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు. దీంతో పాటు తమకు అదనంగా మరికొంత బలం తోడవుతుందని, తద్వారా తన గెలుపు ఖాయమని భావిస్తున్నారు. అందుకే అధికార పక్షంపై జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. నేరుగా చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేశ్ లపైన కూడా విమర్శలు చేస్తూ పాలనలో లోటుపాట్లను మీడియా సమావేశాల ద్వారా బయటపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో తనకు దూరమైన వర్గాలు తిరిగి తన చెంతకు చేరతాయని నమ్ముతున్నారు.గత ఎన్నికల్లో మధ్యతరగతి ప్రజలతో పాటు, రెడ్డి సామాజికవర్గంలోనూ ఓట్లు చీలిపోయాయి. ఉన్నత వర్గాల ఓట్లు ఎటూ రాలేదు. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా అడ్డం తిరిగారు. తమపై పనిభారం మోపడంతో పాటు తమకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడం, ప్రయోజనాలు కూడా ఇవ్వకపోవడంతో అసంతృప్తి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు 90 శాతం మందికిపైగా నాటి ఎన్నికల్లో కూటమి వైపునకు మొగ్గు చూపారు. అయితే ఇప్పుడు తనకు దూరమైన అన్ని వర్గాల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఉందని జగన్ భావిస్తున్నారు. ఈ అదనపు బలం దాదాపు పదిశాతం ఓట్లు తనకు యాడ్ అవుతాయని తన సన్నిహితుల వద్ద లెక్కలు చెబుతున్నారని తెలిసిందిగత ఎన్నికల్లో తన సొంత సామాజికవర్గం లో కూడా అసంతృప్తి ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. రెడ్డి సామాజికవర్గంలో జగన్ పాట్ల సానుభూతి వచ్చిందని భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా గత ప్రభుత్వమే మేలన్న అభిప్రాయంలో ఉన్నారని జగన్ భావిస్తున్నారు. అందుకే ఈ సారి ఎన్నిలకు ముందు జగన్ కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సారి జగన్ హామీలు కూడా భారీగా ఉంటాయని అంటున్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులకు సంబంధించి కీలక హామీలను ప్రకటిస్తారని, అందుకే జగన్ అన్ని లెక్కలు వేసుకునిఈసారి తనదే అధికారమన్న ధీమాలో ఉన్నారన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.

# నయా స్ట్రాటజీతో జనసేనాని



విజయవాడ, జూన్ 13,జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ఆలోచన అంతా కొత్త ఓటు బ్యాంకుపైనే ఉంది. యువ ఓటర్లపైనే ఆయన ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. వచ్చే ఎన్నికల నాటికి కొత్తతరం ఓటర్లు లక్షల సంఖ్యలో వస్తారు. వారే ఎన్నికల్లో విజయానికి కీలకంగా మారనున్నారు. గెలుపులో యువత కీలక భూమిక పోషిస్తుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అందుకే తనకు కులాలు అంటగట్టవద్దని పదే పదే కోరుతున్నారు. తనను ఒక కులానికే ముద్ర వేసి చూడవద్దని, అందరూ ఓట్లు వేస్తేనే తాను గెలిచానని పవన్ కల్యాణ్ పదే పదే గుర్తు చేస్తున్నారు. దీని వెనక పవన్ ఆలోచన రాబోయే యువతరం ఓట్లను ఆకట్టుకునేందుకేనన్నది ఆయన నయా స్ట్రాటజీగా తెలుస్తుంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చంద్రబాబును పక్కన పెడితే .. టీడీపీలో లోకేశ్, వైసీపీలో జగన్, జనసేనలో పవన్ అందరూ చిన్న వయసు వాళ్లే. అందరికంటే లోకేశ్ వయసులో చిన్న అయినప్పటికీ రాజకీయాల్లోకి వచ్చేసరికి మిగిలిన ఇద్దరూ కూడా యూత్ లీడర్ల కిందే లెక్క. అయితే ఈ ముగ్గురిలో యూత్ తనకు కనెక్ట్ అవ్వాలన్నది జనసేనాని ఆలోచనగా ఉంది. పవన్ కల్యాణ్ పై అవినీతి ముద్ర లేదు. మాట మీద నిలబడి ఉండరన్న పేరు తప్ప.. పవన్ కల్యాణ్ పై రెటువంటి చెడు అభిప్రాయం లేదు. మరొకవైపు పవన్ కల్యాణ్ ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం పనిచేస్తారని, రాజకీయాల కంటే ఎక్కువగా అభివృద్ధి పనులపై ఫోకస్ పెడతారన్న పేరు తెచ్చుకోవాలన్న తాపత్రయంలో పవన్ కల్యాణ్ ఉన్నారు.ఇప్పటికే ఓటర్ల సమగ్ర సవరణ ప్రారంభం కానుంది. చాలా వరకూ ఓట్లు పోతాయి. 2029 ఎన్నికల్లో కొత్త ఓటర్లు వచ్చి చేరతారు. వారిని టార్గెట్ చేసుకుని తాను ముందుకు వెళితే గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వస్తాయని పవన్ కల్యాణ్ అంచనా వేస్తున్నారు. తమిళనాడులో విజయ్ కు యువత, మహిళలు ఎక్కువగా కనెక్ట్ కావడంతోనే పార్టీ పెట్టిన ఏడాదిన్నరకే అధికారంలోకి వచ్చారు. అలాంటిది ప్రయత్నిస్తే తాను ఎందుకు కాలేనన్న నమ్మకంతో పవన్ కల్యాణ్ ఉన్నారు. అందుకే ఆయన సొంత సామాజికవర్గాన్ని కూడా దూరం చేసుకునేందుకు సిద్ధమయ్యారన్న టాక్ జనసేన వర్గాల్లో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. మొత్తం మీద పవన్ కల్యాణ్ యువతను ఎంత మేరకు ఆకట్టుకుంటారన్నది భవిష్యత్ లో తేలనున్నప్పటికీ ఆయన ఆలోచన మాత్రం విభిన్నంగా సాగుతుందనే చెప్పాలి.

# ఫీల్ గుడ్ సరే...వీటి సంగతేంటీ...

విజయవాడ, జూన్ 13, అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీలో విపరీతమైన నిరాశ కనిపిస్తోంది. అందువల్లే ఏ మాత్రం అవకాశం దొరికినా సరే వదిలిపెట్టకుండా దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. జరిగింది ఇసుకంత అయితే.. దానిని పెద్ద బండరాయి లాగా చూపించే ప్రయత్నం చేస్తోంది. ఇది కూటమి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. అయితే ఇటువంటి లోపాల మీద కూటమి ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోకపోతే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.అభివృద్ధి, సంక్షేమం అని చెబుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం కచ్చితంగా వీటి మీద దృష్టి పెట్టాలి. అన్ని రకాలుగా పింఛన్లను భారీగా పెంచామని ప్రభుత్వం చెబుతోంది. కానీ రెండు సంవత్సరాల కాలంలో ఇంతవరకు కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కొత్తగా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. గృహాలను కూడా నిర్మించలేదు. నాడు వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అనర్హులకు పింఛన్లు ఇచ్చారు. వారిపై ఇంతవరకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. రీసర్వే సమస్యను ఇంతవరకు పరిష్కరించలేదు. క్వాంటం వ్యాలీ.. డేటా సెంటర్లు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సామాన్యులకు ఏ విధమైన ఉపయోగం లభిస్తుందో వివరించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం మీద ఉన్నది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగుల జీతాలు ఆలస్యం అయ్యేవి. విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు కూడా సరిగా వచ్చేవి కాదు. పిఆర్సి అమల్లో జగన్ ప్రభుత్వం మొండిగా ఉండేది. చివరికి సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్ వెనుకడుగు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల విషయంలో సానుకూల ధోరణితో కనిపిస్తోంది. వేల కోట్ల బకాయిలు విడుదల చేసింది. ఉద్యోగుల సమస్యల మీద దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.అమరావతి నిర్మాణంలో ప్రభుత్వం ఇంకా వేగం పెంచాల్సి ఉంది. కొన్ని విషయాల పట్ల పాఠాలు నేర్చుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ భవనాలు.. సముదాయాల నిర్మాణం మీదనే ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే పబ్లిక్ యాక్టివిటీ లో వేగం పెరగాలంటే కచ్చితంగా లే అవుట్లు డెవలప్ కావాలి. అవి లేకుండా అమరావతిలో ఎవరు కూడా ఇల్లు కట్టుకునే సాహసం చేయరు. వ్యాపారాలు ప్రారంభించలేరు.వైసీపీ పరిపాలనలో ఏపీ రాష్ట్రంలో ఆర్థిక లోటు పెరిగిపోయింది. సంక్షేమ పథకాలకు మాత్రమే నిధుల సర్దుబాటు జరుగుతోంది. అభివృద్ధి పనుల విషయంలో కాస్త ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. అప్పుల మీదనే ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందువల్ల అప్పుల భారం పెరిగిపోతుంది. వీటివల్ల కీలకమైన పథకాల అమలు సాధ్యం కావడం లేదు. ఉదాహరణకు ఎన్టీఆర్ వైద్య సేవ బకాయిలు భారీగా పెరిగిపోయాయి. ఈ పథకానికి నిధుల సర్దుబాటు చేయడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా అధికారులు వ్యవహరించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అలానే కొనసాగుతోంది. పొలిటికల్ గవర్నెన్స్ ను అమలు చేయాలని చంద్రబాబు చెబుతున్నప్పటికీ అధికారులు వినిపించుకోవడం లేదు. కన్సల్టెంట్లు ప్రభుత్వంలో హవా కొనసాగిస్తున్నారు. కన్సల్టెంట్లు చెప్పిన మాటనే ప్రభుత్వం పాటిస్తోంది.. కొన్ని సందర్భాలలో కన్సల్టెంట్లు చెప్పినట్టుగానే చంద్రబాబు చేయాల్సి వస్తుంది. దీనివల్ల సోషల్ మీడియాలో విష ప్రచారం జరుగుతోంది.సూపర్ సిక్స్ పథకాలలో ఇంకా రెండు అమలు కావడం లేదు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు.. ఇది సాధికాకపోతే నెలకు 3000 నిరుద్యోగ భృతి.. ప్రతినెల మహిళకు 1500 రూపాయల చొప్పున ఆడబిడ్డ నిధి ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. ఇక మిగతా పథకాలు తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ.. దీపం 2.. స్త్రీ శక్తి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి.కొంతమంది నేతలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. దారుణంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అవినీతి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. పోలీస్ విధుల్లో కూడా జోక్యం చేసుకుంటున్నారు. వారి వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది.. ఎమ్మెల్యేలు వ్యవహార శైలి మార్చుకోవాల్సిన అవసరం ఉంది. స్వయంగా చంద్రబాబు రంగంలోకి దిగి హెచ్చరికలు జారీ చేస్తున్నారంటే.. ప్రజాప్రతినిధులు ఎలా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఇలా చేసి వైసిపి ప్రజల నుంచి ఎలాంటి ఫలితాన్ని ఎదుర్కొన్నదో అందరూ చూశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి అటువంటి పరిస్థితి రాకూడదంటే నేతలు జాగ్రత్తగా ఉండడం చాలా మంచిది

## మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు.

వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాడ్లాపూర్ రైతులకు మద్దతుగా బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, పోలీసులు రంగాపూర్ చౌరస్తాలో అరెస్ట్ చేసారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు ఇవ్వమని గ్రామ సర్పంచ్, రైతులు అమరణ నిరాహారదీక్షకు దిగారు. ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రైతులను పరామర్శించేందుకు వెళుతుండగా మహేష్ రెడ్డిని పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసారు. పోలీసుల తీరుపై అయన మండిపడ్డారు.

# 25న రానున్న లెనిన్...

హైదరాబాద్, జూన్ 14, ఏజెంట్' వంటి భారీ డిజాస్టర్ ఫ్లాప్ తర్వాత , బాగా గ్యాప్ తీసుకున్న అఖిల్, 'లెనిన్' చిత్రం తో ఈ నెల 25 న మన ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమా పై అక్కినేని ఫ్యాన్స్ లో బోలెడన్ని ఆశలు ఉన్నాయి. ఎందుకంటే ఇప్పటి వరకు విడుదల చేసిన ప్రతీ కంటెంట్ చాలా ప్రామిసింగ్ గా అనిపిస్తున్నాయి. అంతే కాకుండా అఖిల్ ఈ చిత్రం లో చాలా అద్భుతంగా నటించాడని , ముఖ్యంగా సెకండ్ హాఫ్ అదిరిపోయిందని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్. మొత్తానికి అఖిల్ ఈ సినిమాతో మొట్టమొదటి బ్లాక్ బస్టర్ హిట్ ని అందుకోబోతున్నాడని, ఇక్కడి నుండి ఆయన వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరమే ఉండదని అంటున్నారు. అలాంటి సినిమా ఇప్పటికే ఒకసారి వాయిదా పడింది. ఇప్పుడు మరోసారి వాయిదా పడింది అంటూ వార్తలు వినిపిస్తున్నాయి.ముందుగా ఈ చిత్రాన్ని మే డే సందర్భంగా 'మే 1' న విడుదల చేద్దామని అనుకున్నారు. కానీ ఏప్రిల్ 30 న 'పెద్ది' చిత్రం విడుదల కాబోతుందని అప్పటికే ఆ చిత్ర మేకర్స్ అధికారిక ప్రకటన చేయడం తో , అఖిల్ కి రామ్ చరణ్ తో ఉన్నటువంటి అనుబంధానికి విలువ ని ఇస్తూ, మా 'లెనిన్' చిత్రాన్ని జూన్ 25 కి వాయిదా వేస్తున్నట్టు చెప్పుకొచ్చారు నిర్మాతలు. కానీ అసలు నిజం అది కాదు, సినిమా ఇంకా పూర్తి కాకపోవడం వల్లే వాయిదా పడిందని ఇప్పుడు అర్థం అవుతోంది. ట్రేడ్ నుండి అందుతున్న సమాచారం ఏమిటంటే ఈ సినిమా జూన్ 25 న కూడా విడుదల కావడం లేదట. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ బాగా సమయం తీసుకుంటుందని , కొన్ని ఎఈచీ షాట్స్ డెలివరీ అవ్వాల్సిన అవసరం ఉందని , ఇప్పటి వరకు అవి డెలివరీ అవ్వలేదని అంటున్నారు.అంతే కాకుండా ఎడిటింగ్ వర్క్ కూడా ఇంకా పూర్తి అవ్వలేదట. కేవలం ఫస్ట్ హాఫ్ ని మాత్రమే ఇప్పటి వరకు లాక్ చేసినట్టు సమాచారం. రీ రికార్డింగ్ వర్క్ కూడా చాలా వరకు బ్యాలన్స్ ఉందట. అందుకే ఈ చిత్రాన్ని జులై కి వాయిదా వేస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచనలో ఉన్నారు మేకర్స్. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత నాగవంశీ సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నిర్మిస్తుండగా , అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ కూడా నిర్మాణం లో భాగం పంచుకుంది. ముందుగా ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం శ్రీలీల ని తీసుకున్నారు. కానీ ఆమె తప్పుకోవడం తో , ఆమె స్థానంలోకి భాగ్యశ్రీ ని తీసుకున్నారు. ఈ చిత్రం లో అఖిల్ గుడ్డివాడిగా నటించబోతున్నాడని టాక్.

# ఇన్ యాక్టివ్ గా మారిన బండి



కరీంనగర్ జూన్ 13, కొడుకు మీద ఫోక్సో కేసు నమోదైన తర్వాత కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాజకీయంగా అంత యాక్టివ్ గా లేరు. పైగా ఆయన తీవ్ర నిరాశలో కనిపిస్తున్నారు. ఒకప్పటి మాదిరిగా ప్రత్యర్థుల మీద ఆయన ఆగ్రహం గా ఉండడం లేదు. తీవ్రస్థాయిలో మాట్లాడటం లేదు. కార్యకర్తలను కలుస్తున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారు. ఆ తర్వాత ఢిల్లీ లేదా హైదరాబాద్ వెళ్ళిపోతున్నారు. అత్యంత సన్నిహితులకు మాత్రమే ఆయన దగ్గరగా ఉంటున్నారు.కొద్దిరోజుల క్రితం బండి సంజయ్ ఆ మాత్రం కూడా అందుబాటులో లేకుండా పోయారు. సన్నిహితులకు కూడా ఆయన సమాచారం తెలియదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కి ఏమైంది.. ఆయన ఏమైపోయారు.. ఉన్నట్టుండి అజ్ఞాతంలోకి ఎందుకు వెళ్లిపోయారు అనే చర్చ నడిచింది. ఇక నమస్తే తెలంగాణ అయితే బండి సంజయ్ మీద టన్నులకొద్దీ బురద కథనాలు రాయడం మొదలుపెట్టింది. అయితే బండి సంజయ్ ఎట్టకేలకు బయటికి వచ్చారు. తాను ఎందుకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయానో వివరించారు.బండి సంజయ్ అజ్ఞాతంలోకి వెళ్లలేదు. ఎవరికీ కనిపించకుండా పోలేదు. ఆయన అనారోగ్యానికి గురయ్యారు. కల్తీ పాలు తాగడం వల్ల ఆయన ఆరోగ్యం పాడైంది. దీంతో ఆయన చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. గర్జన 20 సంవత్సరాలుగా బండి సంజయ్ కానీ దగ్గు లేదా జ్వరంతో కూడా బాధపడలేదు. హైదరాబాద్ నగరంలో కల్తీ పాలు తాగడం వల్ల ఐదు రోజులు ఆయన మంచానికే పరిమితమయ్యారు. ఇదే విషయాన్ని ఆయన కరీంనగర్ జిల్లా జమ్మికుంట లోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ రైతు సమ్మేళనంలో వెల్లడించారు.రైతులు రసాయన ఎరువులకు దూరంగా ఉండాలని.. ప్రకృతి సిద్ధ మీద దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సేంద్రీయ సాగుతో రైతుల కోటీశ్వరులు కావచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతులను ప్రకృతిసిద్ధమైన ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు 10,000 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయడాన్ని బండి సంజయ్ అభినందించారు.ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలో కల్తీ ఆహార పదార్థాల వినియోగం పెరిగిపోయింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహిస్తున్న దాడులలో ఈ విషయాలు వెలుగుచూస్తున్నాయి. చివరికి కేంద్రమంత్రి కూడా కల్తీ పాల వల్ల అనారోగ్యానికి గురి కావడం ఆందోళన కలిగిస్తోంది.

# 59 నియోజకవర్గాలు రెండు భాగాలు

## 11 నియోజకవర్గాలు మూడు భాగాలు

## సౌత్ లో పెరగనున్న 170 స్థానాలు

హైదరాబాద్, జూన్ 14, దక్షిణది రాష్ట్రాలకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ గుడ్ న్యూస్ చెప్పారు. కొంతకాలంగా కొంతమంది రాజకీయ నాయకులు దక్షిణాది మీద అడ్డగోలుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. కెసిఆర్ నుంచి మొదలు పెడితే రేవంత్ రెడ్డి వరకు దక్షిణాది రాష్ట్రాలను నరేంద్ర మోడీ పట్టించుకోవడంలేదని.. పార్లమెంటు స్థానాల పెంపు విషయంలో కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయితే దీనిపై బీజేపీ సరిగా కౌంటర్ ఇవ్వలేకపోయింది. ఇప్పుడు బిజెపి తీసుకొచ్చిన ప్లాన్ ఆ తరహా నాయకుల నోర్లు మూసే విధంగా ఉంది.గతంలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశం తేలిపోయింది. మెజారిటీ సభ్యులు ఆమోదం తెలపకపోవడంతో ఆ అంశంలో కేంద్ర ప్రభుత్వం విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు అంచనాలకు మించిన బలాన్ని సొంతం చేసుకున్న తర్వాత కేంద్రం మరొకసారి డీలిమిటేషన్ బిల్లును తెరపైకి తీసుకొస్తుంది. మన దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిని పెంచాలని కేంద్రం భావిస్తున్నది. దీనివల్ల ప్రజలకు మరింత సమర్థవంతమైన పరిపాలన లభిస్తుందని కేంద్రం చెబుతోంది. ఇప్పటికే పార్లమెంటు స్థానాల పెంపు విషయాన్ని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది. కీలకమైన ప్రతిపాదనలను అందించిందిజనాభా పెరిగినప్పుడు ఖచ్చితంగా నియోజకవర్గాల ఎ ్ ౖ న రి ్వ బ , ్ జ న సాధ్యమవుతుంది.నియోజకవర్గాల పెంపునకు పెరిగిన జనాభాను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుత జనాభా నివేదికలో పట్టణీకరణ.. ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని ప్రధాని ఆర్థిక సలహా మండలి సూచించింది. దీనివల్ల దేశంలో అన్ని ప్రాంతాలకు పరిపాలన మరింత చేరువవుతుందని.. ఆ ప్రజలకు ప్రతినిధులుగా ఎంపీలు ఉంటారని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది..ఇక దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. కొత్త ప్రతిపాదనలను కేంద్రం అమలు చేస్తే వాటి సంఖ్య 824కు చేరుకునే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాలలో సీట్ల పెంపు ఏకంగా 50% వరకు ఉంటుంది. చిన్న రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న స్థానాలను రెట్టింపు చేస్తారని సమాచారం. దీనివల్ల ఎంపీలు ప్రజలకు మరింత చేరువగా ఉంటారని తెలుస్తోంది.. ప్రధాని ఆర్థిక మండలి నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా 170 పార్లమెంట్ నియోజకవర్గాలను పునర్విభజిస్తారు. ఇందులో 59 నియోజకవర్గాలు రెండు భాగాలవుతాయి. 111 నియోజకవర్గాలు మూడు భాగాలవు తాయి. దీనివల్ల ప్రజలకు ఎంపీలు మరింత దగ్గరవుతారు. సమస్యలను నేరుగా పరిష్కరిస్తారు.నరేంద్ర మోడీ దక్షిణాది రాష్ట్రాలకు పునర్విభజనలో అదిరిపోయే కానుక ఇచ్చే అవకాశం ఉంది. కేరళ రాష్ట్రంలో ప్రస్తుతం 20 స్థానాలు ఉండగా.. అవి 30 కి పెరుగుతాయి. తమిళనాడులో 39 నుంచి 59.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో కూడా స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఇక మన దేశంలో అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పార్లమెంటు స్థానాలు 120కి పెరిగే అవకాశం ఉంది. అక్కడ దాదాపు 80 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి.కొత్త నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజల ప్రాతినిధ్యం మెరుగుపడుతుంది. అంతేకాదు ఓటింగ్ కూడా 2.3 శాతం వరకు పెరుగుతుంది. మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా మహిళల కోసం పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 2027 జనాభా లెక్కల తర్వాతనే చేపట్టాలని కమిటీ ప్రకటించింది. నియోజకవర్గాల పునర్విభజన పూర్తయితే దేశంలో రాజకీయంగా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# 97 శాతం తగ్గిన మొబైల్ డేటా చార్జీలు

హైదరాబాద్, జూన్ 14, పెట్రోల్ ధరలు పెరిగాయని, డీజిల్ ధరలు పెరిగాయిని, గ్యాస్ ధరలు పెరిగాయని, కంరెటు చార్జీలు పెరిగాయని, బస్సు చార్జీలు పెరిగాయని వామపక్ష పార్టీలు, విపక్షాలు ఆందోళనలు చేయడం సహజం. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్రో, గ్యాస్ ధరలపైనే విపక్షాలు ఎక్కువగా ఆందోళన చేశాయి. అయితే ధరలు తగ్గినప్పుడు మాత్రం ఎవరూ స్వాగతించరు. అయితే రోజురోజుకు అన్నింటి ధరలు పెరుగుతున్నాయి. కానీ 12 ఏళ్లలో అనూహ్యంగా ఒకదాని ధర 97 శాతం తగ్గింది. అందరికీ అందుబాటులోకి వచ్చింది. అందే మొబైల్ డేటా.కేంద్ర ప్రభుత్వం డిజిటల్ రంగంలో సాధించిన అపూర్వ విజయాన్ని వెల్లడించింది. 2014లో 1 గిగాబైట్(జీబీ) డేటా ధర రూ.269 ఉంటే, ప్రస్తుతం అది కేవలం రూ.9.2కి తగ్గింది. అంటే గత 4,399 రోజుల్లో (సుమారు 12 ఏళ్లలో) డేటా ధరలో 97 శాతం తగ్గుదల నమోదైంది.ఇది భారత్ డిజిటల్ చరిత్రలో ఒక మైలురాయి. ఈ అద్భుత మార్పు వెనుక కేంద్ర ప్రభుత్వం నిరంతరం చేపట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమం, భారత్‌నెట్ ప్రాజెక్ట్, ఆప్టికల్ ఫైబర్ విస్తరణ, పోటీతత్వం ప్రోత్సాహం, 2016లో రిలయన్స్ జియో ప్రవేశం వంటి అనేక అంశాలు కలిసి ఈ ధరల తగ్గుదలకు దోహదపడ్డాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించడం, స్పెక్ట్రం అలాట్‌మెంట్‌లో పారదర్శకత, 5జీ సేవల వేగవంతమైన రోల్‌అవుట్ వంటి చర్యలు డేటా సరఫరాను భారీగా పెంచి, ధరలను తగ్గించాయి.ఈ చౌక డేటా ధరల వల్ల దేశవ్యాప్తంగా కోట్లాది మంది సామాన్యులు, విద్యార్థులు, రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు, గ్రామీణ యువతకు అధునాతన ఇంటర్నెట్ సేవలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. విద్యా రంగంలో ఆన్‌లైన్ క్లాసులు, డిజిటల్ లెర్నింగ్ఆరోగ్య రంగంలో టెలి మెడిసిన్ సేవలు, ఆర్థిక రంగంలో యూపీఐ, డిజిటల్ బ్యాంకింగ్, చిన్న వ్యాపారాలు ఆన్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా మార్కెట్‌ను చేరుకోవడానికి చౌక డేటా ధరలు ప్రధాన ఆధారం అయ్యాయి.ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత చౌకైన డేటా ధరలు కలిగిన దేశాల్లో ఒకటిగా నిలిచింది. నాణ్యతతోపాటు చౌకదనం కలిపి ఇంటర్నెట్‌ను సామాన్యుని జేబులోకి తీసుకువచ్చిన దేశంగా భారత్ ప్రపంచం ముందు నిలుస్తోంది. మోదీ పాలనలో డేటా ధరల్లో వచ్చిన ఈ భారీ తగ్గుదల కోట్లాది భారతీయుల జీవన విధానాన్ని, అవకాశాలను మార్చిన నిజమైన డిజిటల్ విప్లవం. చౌకైన, నాణ్యమైన ఇంటర్నెట్ దేశంలోని చివరి వ్యక్తి వరకు అందుబాటులోకి వచ్చిన ఈ ప్రయాణం భారత్‌ను ప్రపంచ డిజిటల్ శక్తిగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

# ఆయిల్ సంక్షోభానికి చెక్..

న్యూఢిల్లీ, జూన్ 14, పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు.. హర్మూజ్ ఎప్పుడు తెరుచుకుంటుందో అర్థం కావడం లేదు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. ముఖ్యంగా దిగుమతిపై ఆధారపడిన భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు యురోపియన్ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పటికే చమురు ధరలు భారీగా పెరిగాయి. భారత్‌లో గ్యాస్, చమురు ధరలను కేంద్రం పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా దేశంలో చమురు సంక్షోభాన్ని తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో అత్యవసర ఇంధన నిల్వల సామర్థ్యాన్ని 50 శాతం పెంచబోతోంది. ప్రస్తుతం 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉండగా, వాటిని 90 రోజుల వరకు పెంచే దిశగా అడుగులేస్తోంది. ఆయిల్ కంపెనీలను ఫ్యూయల్ కెపాసిటీని పెంచుకోవాలని ఆదేశించనున్నట్లు తెలుస్తోంది.దేశంలోని మొత్తం ఇంధన అవసరాల్లో సుమారు 90 శాతం విదేశాల నుంచి దిగుమతుల ద్వారానే తీరుతోంది. పశ్చిమాసియా ప్రాంతం నుంచి ఎక్కువగా చమురు వస్తోంది. ఆ ప్రాంతంలో ఏర్పడిన సంక్షోభం వల్ల సరఫరా చైన్ దెబ్బతిన్నది. అలాంటి పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ, రవాణా రంగం, పరిశ్రమలు దెబ్బతినకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అని ప్రభుత్వం భావిస్తోంది.ఇంధన నిల్వలను పెంచడం అనేది కేవలం నిల్వల సామర్థ్యం పెంచడం మాత్రమే కాదు. ఇది దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసే వ్యూహాత్మక చర్య. పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. అలాంటి సమయంలో దేశంలో తగినంత నిల్వలు ఉంటే, ధరలు ఎక్కువగా పెరగకుండా నియంత్రించవచ్చు. అలాగే రవాణా రంగం, వ్యవసాయం, పరిశ్రమలు అంతరాయం లేకుండా కొనసాగవచ్చు. దీర్ఘకాలికంగా చూస్తే ఈ చర్య ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుంది. అయితే నిల్వలు పెంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నిల్వ ఖర్చులు భారీగా ఉంటాయి. ఆయిల్ కంపెనీలపై ఈ భారాన్ని ఎలా పంచాలనేది కూడా ముఖ్యమైన అంశం.పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పుడు చమురు సరఫరా ఎప్పుడైనా ప్రభావితం కావచ్చు. భారతదేశం వంటి దిగుమతి ఆధారిత దేశాలకు ఇది పెద్ద సవాల్. అందుకే ప్రభుత్వం ముందస్తుగా నిల్వలు పెంచి, సంక్షోభం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ చర్య ద్వారా దేశం ఆకస్మిక సంక్షోభాలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఇంధన భద్రతపై దృష్టి పెట్టిన ఇతర దేశాలతో సమానంగా భారతదేశం కూడా అడుగులేస్తోంది. దీర్ఘకాలంలో ఇంధన వైవిధ్యీకరణవైపు కూడా అడుగులేయడం మరింత మంచిదని నిపుణుల అభిప్రాయం.పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన నిల్వలను 50 శాతం పెంచే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దేశ ఇంధన భద్రతకు ముఖ్యమైన అడుగు. 60 రోజుల నుంచి 90 రోజులకు నిల్వలు పెంచడం ద్వారా ఆకస్మిక సరఫరా అంతరాయాలను ఎదుర్కోవచ్చు. ఈ చర్య ఆర్థిక స్థిరత్వం, ధరల నియంత్రణ మరియు దేశ భద్రతకు దోహదపడుతుంది.

## అక్కను వేధిస్తున్నాడని బావను చంపిన బావమరిది

హైదరాబాద్ అక్కను తరచూ వేధిస్తున్నాడని బావను బావమరిది హతమార్చాడు. గోల్కొండలోని పతేదర్వాజా ప్రాంతానికి చెందిన రుక్సానా అనే మహిళను పాతబస్తీకి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ చాంది మసూద్ పెళ్లి చేసుకున్నాడు. అయితే రుక్సానా భర్త తరచూ తనతో గొడవ పడుతున్నాడని పుట్టింటికి వచ్చింది. పుట్టింటికి వెళ్లి మరోసారి రుక్సానాతో గొడవ పడుతుండగా, తన అక్కను తరచూ వేధిస్తున్నాడని బావపై బావమరిది సోయల్ తిరగబడ్డాడు. అదే కోపంలో తన స్నేహితులు జాబేర్, అప్పుతో కలిసి చాంది మసూద్ను కత్తులతో విచక్షణారహితంగా హతమార్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నారు.

# హస్తినకు రాములమ్మ...



హైదరాబాద్, జూన్ 13, తెలంగాణ కాంగ్రెస్ నేత విజయశాంతి పార్టీ వైపు చూడటం లేదు. పదవిలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ అంతే. కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. కానీ ఎమ్మెల్సీ పదవితో ఆమె సంతృప్తికరంగా లేనట్లు కనపడుతుంది. తన రేంజ్ కు మంత్రి పదవి దక్కాలన్న యోచనలో విజయశాంతి ఉన్నారని చెబుతున్నారు. అందుకే విజయశాంతి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. శాసనమండలి సమావేశాలకు మాత్రమే హాజరవుతూ మొక్కుబడిగా ప్రశ్నలు వేస్తున్నారు. మొన్న జరిగిన శాసనమండలి సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడి మరోసారి విజయశాంతి తన అక్కసును వెళ్లగక్కారు.కాంగ్రెస్ లో త్వరలో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న ప్రచారం ఎప్పటి నుంచో జరుగుతుంది. అయితే అన్ని రకాల అర్హతలున్న తనకు మంత్రి పదవి ఎందుకు దక్కడం లేదన్నది ఆమె సన్నిహితుల వద్ద ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. నిజానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో విజయశాంతి పేరు రావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అసలు విజయశాంతి పేరును ఎవరూ ఊహించ లేదు. ఢిల్లీలో ఉండి మల్లికార్జున ఖర్గేను కలిసినప్పటికీ ఆమె పేరు ఖరారు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎవరూ భావించలేదు. నేరుగా హైకమాండ్ ను కలిసి తనకు ఎమ్మెల్సీ పదవిని తెచ్చుకున్న ఘనత విజయశాంతిది. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి అనేక మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నేరుగా రాహుల్ ను కలిసి తమకు మంత్రిపదవి ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో రాములమ్మ కూడా హస్తిన బాట పడుతున్నారన్న టాక్ వినపడుతుందిఎమ్మెల్సీ వచ్చిన ఆనందం మాత్రం ఆమెలో కనిపించడం లేదు. తాను మంత్రి పదవికి పూర్తి స్థాయిలో అర్హత కలిగిన నేతనంటూ మరోసారి ఢిల్లీకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈసారి కూడా ఇక్కడి నేతలతో సంబంధం లేకుండా నేరుగా ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ ను కలిసి తన మంత్రి పదవి చర్చించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తనకు మంత్రి పదవి ఇస్తే తాను పార్టీకి ఏం చేయదలచుకున్నానో.. కూడా హైకమాండ్ కు నివేదించేందుకు ఒక బ్లూ ప్రింట్ ను కూడా సిద్ధం చేసుకున్నట్లు చెబుతున్నారు. మొత్తం మీద విజయ శాంతి ఎమ్మెల్సీగానే ఊహించని విధంగా అయినప్పుడు మంత్రి కావడంలో పెద్దగా ఎవరూ నోరు వెళ్లబెట్టాల్సిన పనిలేదంటున్నారు సొంత పార్టీ నేతలు.

ఆగని అంతర్గత పోరు

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కారానికి గురయింది. అయితే అందుకు తెలంగాణాలో నమోదయిన కేసు కారణమని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. అఫడవిట్ లో కేసు గురించి పేర్కొనకపోవడంతో మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన ఎన్నికల అధికారులు మీనాక్షి నామినేషన్ ను తిరస్కరించారు. అయితే తెలంగాణలో ఆమెపై కేసు నమోదు కాలేదు. కేవలం ఒక కేసులో న్యాయస్థానం సమన్లు మాత్రమే జారీ చేసింది. ఇవన్నీ పక్కన పెడితే అసలు తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పై కేసు ఉన్నట్లు మధ్యప్రదేశ్ బీజేపీ నేతలకు ఉప్పు అందించిందెవరు? అన్నదే ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.మీనాక్షి నటరాజన్ స్ట్రయిట్ ఫార్వార్డ్ నేత. నిరాడంబరంగా ఉంటారు. ఖరీదైన జీవితాన్ని కూడా ఆశించరు. దీపా మున్షీ దాస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మీనాక్షి నటరాజన్ కు తెలంగాణ కాంగ్రెస్ ఇన్ ఛార్జి బాధ్యతలను అప్పగించింది. ఆమె తెలంగాణ కాంగ్రెస్ లో ఇన్ ఛార్జి పదవి తీసుకున్న వెంటనే ఒకే మాట చెప్పారు. పార్టీకి నమ్మకంగా ఏళ్ల నుంచి పనిచేసిన వారికే ప్రథమంగా గుర్తింపు ఉంటుందని, ఎన్నికలకు ముందు వచ్చిన వారికి పదవులు తర్వాత ఇస్తామని నిర్మొహమాటంగా చెప్పారు. దీంతో పాటు ఆమె కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునే ప్రయత్నం జరగలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి నివేదికలను అందిస్తున్నారన్న అనుమానం ఇక్కడి నేతలకు ఉంది.మీనాక్షి నటరాజన్ పార్టీ ఇన్ ఛార్జిగా పదవి బాధ్యతలను తీసుకున్న తర్వాత తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీలో శత్రువులు పెరిగారన్నది అంతే వాస్తవం. మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు సయితం నామినేషన్ తిరస్కారానికి గురైన తర్వాత మీడియాతో మాట్లాడుతూ తమకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఇచ్చిన సమాచారం మేరకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే మీనాక్షి నటరాజన్ పై బీజేపీ నేతలకు సమాచారం ఇచ్చెందవరు? అన్నదానిపై ఇప్పుడు కాంగ్రెస్ లో పోస్టుమార్టం జరుగుతుంది. కానీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాత్రం తెలంగాణ కాంగ్రెస్ నుంచి ఎవరూ సమాచారం ఇవ్వలేదని, కేవలం తెలంగాణ బీజేపే నేతలు ఇచ్చిన సమాచారంతోనే వారు ఫిర్యాదు చేశారంటున్నారు. మొత్తం మీద మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్ లో ప్రకంపనలు పుట్టిస్తుంది.

## ఇకపై డిజిటల్ పౌర సేవల కేంద్రాలుగా సహకార సంఘాలు

నల్గొండ, జూన్ 13, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఒక చిన్న సర్టిఫికేట్ కోసమో, పాస్‌పోర్ట్ దరఖాస్తు కోసమో పట్టణాల్లోని మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే రోజులకు త్వరలోనే తెరపడనుంది. గ్రామాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలనే ఇకపై మల్టీ సర్వీస్ డిజిటల్ హబ్‌లుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ డిజిటల్ భారత్ చొరవతో, నాబార్డు సమన్వయంతో రూపుదిద్దుకుంటున్న ఈ సరికొత్త కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్–సీ) ద్వారా.. ఆధార్, పాన్ కార్డు సేవలతో పాటు వందలాది ప్రభుత్వ, ప్రైవేటు సేవలను రైతుల వద్దకే తెస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చిన్న డిజిటల్ పని కోసమైనా, ప్రభుత్వ సేవలను పొందాలన్నా మండల కేంద్రాలకో లేదా పట్టణాలకో పరుగులు తీసే రోజులు త్వరలోనే కానరాకుండా పోనున్నాయి. ఇకపై మీ గ్రామంలో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారానే సమస్త డిజిటల్ పౌర సేవలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో ఈ సంఘాలన్నింటినీ కామన్ సర్వీస్ సెంటర్లుగా (సీఎస్‌సీ) మార్చే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. సాధాం ˇణంగా ప్రాథమిక సహకార సంఘాలు అంటే కేవలం రైతులకు రుణాలు ఇవ్వడం, ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయడానికే పరిమితం అనే భావన ఉంది. అయితే వీటికి పూర్తిస్థాయిలో డిజిటల్ హంగులు అద్ది, డిజిటల్ భారత్ పథకంలో భాగంగా గ్రామీణులకు అవసరమైన అన్ని రకాల సామాజిక, సంక్షేమ, విద్యా, ఆరోగ్య సేవలను ఒకే చోట అందించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగానే కేంద్ర సహకార శాఖ, ఐటీ మంత్రిత్వ శాఖ, నాబార్డుల మధ్య జాతీయ స్థాయిలో కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సరికొత్త డిజిటల్ విప్లవం ద్వారా పీఏసీఎస్‌లు కేవలం వ్యవసాయ కేంద్రాలుగానే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త ఉపాధి అవకాశాలను సృష్టించే డిజిటల్ హబ్‌లుగా రూపాంతరం చెందనున్నాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిని ఈ ఏడాది ఆఖరు నాటికి వంద శాతం కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే తొలి విడతగా రాబోయే ఆగస్టు 15వ తేదీ నాటికి 562 సంఘాల్లో సేవలను ప్రారంభించేందుకు ఐటీ శాఖ మద్దతుతో లైసెన్సులు, ఆన్‌లైన్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటికే 15 కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. అలాగే డిజిటల్ సేవలతో పాటుగా ప్రభుత్వ, వ్యాపార విభాగాలు కూడా ఇక్కడే కొలువుదీరనున్నాయి.అయితే ఈ కామన్ సర్వీస్ సెంటర్లలో ఆధార్ కార్డు అప్‌డేట్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ దరఖాస్తులు, ఓటరు గుర్తింపు కార్డులు, జనన మరణాల నమోదుచేసుకోవచ్చు. అంతేకాకుండా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, భూసార పరీక్ష కార్డులు, డెయిరీ, మత్స్య పరిశ్రమ సేవలు, రేషన్, గోదాముల నిర్వహణ వంటి సేవలను కూడా అందిస్తారు. అలాగే జీవన్ ప్రమాణ్ పత్రాలు,శ్రమయోగిమాన్‌ధన్‌పెన్షన్లు, స్కాలర్ షిప్‌లు, ఐటీ రిటర్నుల దాఖలు, జీవిత బీమా, విద్యుత్, నీటి బిల్లుల చెల్లింపులు, వాహన్, ఈ చలాన్, ఈ స్టాంపుల జారీ, బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్ సదుపాయం కూడా ఇక్కడ లబి ˛స్తుంది.వీటన్నింటితో పాటు భవిష్యత్తులో ఈ సహకార సంఘాలను జన ఔషధి కేంద్రాలుగా మార్చి..రాయితీ ధరలపై నాణ్యమైన ఔషధా లనువిక్రయించడానికి కూడాప్రత్యేక లైసెన్సులు మం జూరుచేయ నున్నారు. ఈచొరవతో గ్రామీ ణ ప్రజల సమయం,డబ్బుభారీగాఆదా కాను న్నాయి.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మరో ఇద్దరు బలి

సికింద్రాబాద్ హైదరాబాద్ పాతబస్తీలో విషాదం మరవకముందే.. అల్వాల్ పరిధిలో రోడ్డుపై తెగిపడిన కరెంట్ తీగలు తగిలి కరెంట్ షాక్తో తండ్రి కూతురు మృతి చెందారు. శనివారం తెల్లవారుజామున రోడ్డుపై తెగిపడిన చెట్టు కొమ్మలు తొలగిస్తూ కరెంట్ షాక్తో తండ్రి కూతుళ్లు సందీప్, రితిక మృతి చెందారు. వర్షాకాలం రాకముందు విద్యుత్ అధికారులు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని స్థానికుల ఆగ్రహం.

# పబ్లిక్ గార్డెన్ టూ లక్డీకాపూల్ 1.5 కిలోమీటర్ల వై షేప్ లో ఫ్లైఓవర్

హైదరాబాద్ జూన్ 13, హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా కోర్ సిటీ పరిధిలోని నాంపల్లి, అసెంబ్లీ, లక్డీకాపూల్ మార్గాల్లో నిత్యం నరకంగా మారుతున్న వాహనాల రద్దీని నియంత్రించడానికి సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. పబ్లిక్ గార్డెన్ నుంచి అసెంబ్లీ వెనుక వైపుగా లక్డీకాపూల్ వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల పొడవున ఆంగ్ల అక్షరం 'జ' (వై) ఆకారంలో నిర్మించ తలపెట్టిన ఈ వంతెనకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ప్రణాళికలు, డిజైన్లను సిద్ధం చేసింది.సాధారణంగా నగరంలో ఫ్లైఓవర్ల నిర్మాణాల సమయంలో ప్రైవేటు ఆస్తుల సేకరణ పెద్ద సవాలుగా మారుతోంది. భూసేకరణ కారణంగా కోర్టు కేసులు, పరిహారం వివాదాలు తలెత్తి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి ఆలస్యం అవుతున్నాయి. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈ ప్రతిపాదిత వంతెనను గరిష్ఠంగా ప్రభుత్వ భూముల్లోనే నిర్మించేలా అధికారులు చాకచక్యంగా ప్లాన్ చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో హెచ్‌ఎండీఏ ఇప్పటికే సమగ్ర సర్వేను పూర్తి చేసింది. దాదాపు 99 శాతం వరకు ప్రభుత్వ ఆస్తులను కేటాయించింది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్తుల అవసరం ఎక్కువగా లేకుండా, ఎక్కడా వివాదాలకు తావులేకుండా ఈ ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను రూపొందించింది.ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ముందు భాగం నుంచి ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి పబ్లిక్ గార్డెన్ మీదుగా, అసెంబ్లీ వెనుక వైపు నుంచి రైల్వే లైన్ వెంబడి ముందుకు సాగుతుంది. లక్డీకాపూల్ వద్దకు చేరుకోగానే ఈ వంతెన రైల్వే లైన్ మీదుగా ప్రయాణించి లక్డీకాపూల్ జంక్షన్‌ను దాటుతుంది. ఇక్కడే అసలు ఇంజినీరింగ్ అద్భుతం జరగనుంది. జంక్షన్ దాటిన తర్వాత ఈ ఫ్లైఓవర్ రెండుగా చీలిపోతుంది. అంటే 'వై' షేప్‌గా మారుతుంది. ఇందులో ఒక మార్గం నేరుగా మాసబ్ ట్యాంక్ వైపు వెళ్లే రహదారికి, మరో మార్గం ఖైరతాబాద్ వైపు వెళ్లే రహదారికి అనుసంధానం అవుతుంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కంటే ముందే లక్డీకాపూల్ ప్రధాన రహదారిపై ఈ వంతెన ల్యాండ్ అయ్యేలా డిజైన్ చేశారు.హైదరాబాద్–విజయవాడ రహదారికి అనుసంధానంగా ఉండే ఈ కోర్ సిటీ రూట్‌లో భారీ వాహనాల రాకపోకల వల్ల రాత్రి వేళల్లోనూ తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో విధించే ఆంక్షల వల్ల వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కొత్త వంతెన అందుబాటులోకి వస్తే నాంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు ఖైరతాబాద్ లేదా మాసబ్ ట్యాంక్ వైపు సిగ్నల్ ఫ్రీగా వెళ్లవచ్చు. అయితే, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దీనిని పూర్తిగా 'వన్–వే'గా మార్చనున్నారు. నాంపల్లి నుంచి వెళ్లే వాహనాలకు మాత్రమే దీనిపై అనుమతి ఉంటుంది. ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్ నుంచి వచ్చే వాహనాలను దీనిపైకి అనుమతించరు.

# అక్రమాస్తుల వేలానికి రంగం సిద్ధం

హైదరాబాద్ జూన్ 13, రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ ప్రతియేటా వందలాది మంది ప్రభుత్వ అధికారులను లంచాలు తీసుకుంటూ లేదా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసుల్లో పట్టుకుంటోంది. సోదాల సమయంలో భారీ మొత్తంలో నగదు, బంగారాన్ని, స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, ఇతర విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. అయితే, ఈ ఆస్తులు చివరకు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయా? మళ్లీ సంబంధిత వారికి తిరిగి ఇస్తారా.. ఆ ఆస్తులను ఏం చేస్తారు..? ఎక్కడికి తరలిస్తారు అనే విషయాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.వాస్తవానికి ఏసీబీ సోదాల్లో పట్టుబడిన నగదును నేరుగా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ కట్టించి వేలం వేస్తారు. వీటితో పాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ ఫిక్స్ డిపాజిట్లను కోర్టు ఉత్తర్వుల మేరకు.. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల ద్వారా మూసివేస్తారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు బదలీ చేయిస్తారు.ఒకవేళ అక్రమాస్తుల్లో కబ్జాలు చేసినవి గానీ, ప్రభుత్వ భూములు గానీ ఉంటే ప్రత్యేక చట్టం ద్వారా స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. అధికారుల అక్రమాస్తులను వేలం వేసిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు లేవని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి వస్తారు. విధి నిర్వహణలో భాగంగా రూ.100 లంచం తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవు. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారితో పాటు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులను ఏసీబీ అరెస్ట్ చేసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. ఈ సందర్భంగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బినామీ ఆస్తుల వివరాలను కోర్టులో సమర్పిస్తుంది. ఆ తరువాత సంబంధత అధికారికి నోటీసులు జారీ చేసి.. ఆయా ఆస్తులకు సంబంధించిన చట్టబద్ధమైన ఆదాయ వనరులను వివరించాలని కోరుతుంది. సరైన ఆధారాలు సమర్పించకపోతే ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తుందికోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితుడు దోషిగా తేలితేనే అక్రమాస్తులపై తుది చర్యలు ప్రారంభమవుతాయి. లంచాల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను నేరాల ద్వారా కూడబెట్టిన ఆస్తులుగా పరిగణించి ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించవచ్చు. ఇళ్లు, ప్లాట్లు వంటి స్థిరాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉంటుంది. అలా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తారు.ఏసీబీ సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదును ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ నిర్ధారించి కోర్టు అనుమతితో వేలం వేయవచ్చు. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్ డ్ డిపాజిట్లను కూడా చట్ట ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఉన్నతాధికారులను ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఏసీబీ అరెస్టులు చేసింది. వీరిలో కొందరు అధికారులు రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో బయటపడినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు దోషులుగా తేలి, అక్రమాస్తులు వేలం దశకు చేరితే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో అవినీతి అధికారులకు ఇదో హెచ్చరికగా ఉంటుందని పేర్కొంటున్నారు.

## బోధన్ లో కనిపించని షకీల్

నిజామాబాద్, జూన్ 13,ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో.. గులాబీ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాలు జోరుగా జరుగుతున్నాయి. మీటింగ్స్‌కు హాజరవుతున్న పార్టీ నేతలంతా ఐక్యతా రాగం ఆలపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు జట్టుగా, కలిసి కట్టుగా సమావేశాల్లో పాల్గొన్ని క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు. ఇక్కడ మొత్తం 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఒక్క బోధన్ మినహా అన్ని చోట్ల సమావేశాల నిర్వహణ పూర్తయింది. చివరికి నియోజకవర్గ ఇన్చార్జ్ లేని బాన్సువాడలోనూ మూడు మండలాలకు ఓ సమావేశం చొప్పున పూర్తి చేశారు. కానీ? మాజీ ఎమ్మెల్యే షకీల్ బాధ్యుడిగా ఉన్న బోధన్‌లో మాత్రం పట్టించుకునే నాధుడే లేడు. అక్కడ అసలు సన్నాహక సమావేశం జరుగుతుందో లేదో కూడా తెలియని గందరగోళ పరిస్థితులు ఉన్నాయట. ఈనెల 1న మీటింగ్ ఉంటుందని ప్రకటించి.. వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు ఉంటుందో తెలియదు. సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీలుకున్న బీఆర్‌ఎస్ఎక్కడికక్కడ ఇన్చార్జ్‌లను నియమించి రిపోర్టులు తెప్పించుకుంటోంది. బోధన్‌లో మాత్రం సమావేశం జరగకపోవడం, ఇన్చార్జ్ షకీల్ అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులపై గులాబీ బాస్ ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. పార్టీ తరపున నిరసన కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు వచ్చినా.. ఇక్కడ ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క కార్యక్రమం కూడా జరగలేదు. ఈ పరిణామాలు నాయకత్వానికి ఇబ్బందిగా మారడంతో పాటు? పార్టీ క్యాడర్ సైతం నిరుత్సాహంగా ఉన్నట్టు తెలుస్తోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జరిగిన పరిణామాలతో దుబాయ్ వెళ్లిపోయారు షకీల్. అక్కడి వ్యాపారాల్లో బిజీ అయ్యారట. అప్పట్లో ఆయన బోధన్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో మాజీ ఎమ్మెల్యే భార్యే అడపాదడపా పార్టీ వ్యవహారాలను చక్కబెట్టారు. తర్వాత కొన్నాళ్ళకు తిరిగి వచ్చిన షకీల్ ఇక యాక్టివ్ పాలిటిక్స్ చేస్తానని ప్రకటించారు. మళ్లీ ఏం జరిగిందో ఏమో.. తెలియదుగానీ? ఇంకోసారి దుబాయ్ ఫ్లైట్ ఎక్కేశారు. అక్కడి బిజినెస్ వ్యవహారాల్లో బిజీ అయిపోయి ఇక్కడ పార్టీని గాలికొదిలేశారన్నది కేడర్ టాక్. తాజాగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అందరూ పాల్గొంటున్నా.. ఆయన మాత్రం డుమ్మా కొడుతున్నారు. దీంతో? తమ నియోజకవర్గంలో అసలేం జరుగుతోందో అర్థంకాక కారు కేడర్ గందరగోళపడుతోంది. మాజీ ఎమ్మెల్యే కనిపించడం లేదంటూ సొంత పార్టీ కార్యకర్తలే సెటైర్లు వేస్తున్నారంటే పరిస్దితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని అంటోంది ద్వితీయ శ్రేణి. బోధన్ సభ్యత్వ నమోదు ఇన్చార్జ్‌గా ఉన్న మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు సైతం ఈ అంశంపై కేసీఆర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారట. దుబాయ్‌తో పాటు జిల్లాలోనూ రైస్ మిల్లు బిజినెస్‌లో బిజీగా మారిన షకీల్ మెల్లిగా రాజకీయాలకు దూరం అవుతున్నారా అన్నది కొందరి అనుమానం. ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం వెనుక ఆసక్తి లేకపోవడమేనా..? లేక ఇతర బలమైన కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి. ఇలాంటి చాలా ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందేనన్నది రాజకీయ వర్గాల మాట. కానీ అప్పటి వరకు క్యాడర్ తలోదిక్కు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ పెద్దలదే. బాస్. జర దేఖో హమారా బోధన్ కోఅంటున్న కార్యకర్తల మాటల్ని పార్టీ పెద్దలు ఎంతవరకు పట్టించుకుంటారో చూడాలి.

# ఘనంగా 'పోలీస్ కంప్లైంట్' మూవీ సక్సెస్ సెలబ్రేషన్స్



వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి, రాగిణి ద్వివేది ప్రధాన పాత్రల్లో ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించిన హారర్-యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్' జూన్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో చిత్రబృందం ఘనంగా సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. కేక్ కట్ చేసి చిత్ర విజయాన్ని ఆనందంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ఈ సినిమా హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్ సినిమా ప్రమోషన్‌లో పాల్గొనలేదని చిత్రయూనిట్ ఆరోపణల నేపథ్యంలో ఆమె ప్రొడ్యూసర్ కౌన్సిల్ ను సంప్రదించారు. ఈ వివాదాన్ని పెద్దల జోక్యంతో సానుకూలంగా పరిష్కరించుకున్నామని చెప్పాను. దీంతో దర్శకుడు సంజీవ్ మేగోటి గారు తన తప్పు లేకపోయినా వరలక్ష్మికి సారీ చెప్పారు. ఆయన ప్రదర్శించిన వినయం, సహనమే ఈ విజయానికి మరో కారణమని పేర్కొన్నారు. సినిమా మంచి కలెక్షన్లతో ముందుకు సాగడం ఇండస్ట్రీకి కూడా శుభపరిణామమని అన్నారు.

దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, "మా చిత్ర హీరోయిన్ వరలక్ష్మి శరత్ కుమార్ నాలెడ్జ్ కంటే మా నాలెడ్జ్ లక్ష రేట్లు ఎక్కువ ఉంది. అందుకే ప్రసన్న కుమార్ వంటి పెద్దల సూచన మేరకే ఆమెకు సారీ చెప్పడం జరిగింది. అంతేకానీ, సమస్య పూర్తి సర్దుమణిగిందని కూడా చెప్పలేను. మొత్తానికి ఒక వివాదంతో సతమతం అయ్యాం.. చివరికి విజయంతో శుభం కార్డు పడిందని భావిస్తున్నాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విడుదలైన 'పోలీస్ కంప్లైంట్'కు అద్భుతమైన స్పందన వస్తోంది. విడుదలైన రెండవ రోజు నుంచే థియేటర్‌లు పెరుగుతున్నాయి. దర్శకుడిగా, రచయితగా, సంగీత దర్శకుడిగా ఈ సినిమా నాకు ఎంతో ప్రత్యేకం. చిత్రబృందంలోని ప్రతి ఒక్కరి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైంది. సూపర్ స్టార్ కృష్ణగారికి నివాళిగా రూపొందించిన ప్రత్యేక గీతానికి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. థియేటర్ల నుంచి బయటకు వచ్చే ప్రేక్షకులు సంతృప్తిగా స్పందించడం మాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని అన్నారు.

అలాగే, "52 మంది సీనియర్ ఆర్టిస్టులతో కేవలం 45 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే విభిన్న కాన్సెప్ట్ ఆధారంగా రూపొందిన ఈ కథలో హారర్, థ్రిల్లర్, యాక్షన్ అంశాలను సమన్వయం చేశాం. ఈ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రతి ప్రేక్షకుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.

హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, "సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. దర్శకుడు సంజీవ్ మేగోటి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. నా అభిమాన నటుడు సూపర్ స్టార్ కృష్ణగారిని గుర్తు చేసే పాటలో నటించడం నాకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చింది. కుటుంబ సమేతంగా చూసే మంచి వినోదాత్మక చిత్రం ఇది" అన్నారు.

నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ, "వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు, స్నేహితులు ఫోన్ చేసి సినిమా గురించి ప్రశంసించడం ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో భాగస్వామి కావడం సంతోషంగా ఉంది. అవకాశం ఇచ్చిన దర్శకుడు సంజీవ్ మేగోటి గారికి ధన్యవాదాలు" అన్నారు.

నటుడు విజయభాస్కర్ మాట్లాడుతూ, "కర్మ సిద్ధాంతం ఆధారంగా తెరకెక్కిన ఈ కథ నాకు చాలా నచ్చింది. 'బతుకమ్మ' సినిమా తర్వాత నాకు ఈ స్థాయిలో సంతృప్తినిచ్చిన చిత్రం ఇదే. ఈ సినిమాలో చేసిన పోలీస్ పాత్రకు మంచి గుర్తింపు లభిస్తోంది" అని చెప్పారు.

డిస్ట్రిబ్యూటర్ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ, "పెద్ద చిత్రాలకు ధీటుగా ఈ సినిమాను విడుదల చేశాం. పాజిటివ్ టాక్‌తో సినిమా థియేటర్లలో విజయవంతంగా కొనసాగుతోంది" అన్నారు.

నిర్మాత ఘంటా శ్రీనివాస్ మాట్లాడుతూ, "సినిమాలో ప్రతి నటుడు తన పాత్రకు పూర్తి న్యాయం చేశాడు. ప్రేక్షకుల ఆదరణ మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది" అన్నారు. హారర్, యాక్షన్, కామెడీ, రొమాన్స్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన 'పోలీస్ కంప్లైంట్' ప్రస్తుతం పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకులను అలరిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

చిత్ర బృందం

నటీనటులు: వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి, రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, పృథ్వి, కృతి వర్మ, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, ప్రీతి సుందర్, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్, దిల్ రమేష్, మధు నంబియార్, సత్తెన్న, విజయభాస్కర్ తదితరులు.

# ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రం పెద్ద హిట్ అవ్వాలి - వి. వి. వినాయక్



వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాథ్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో శు క్రవారం మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో..

×వి.వి. వినాయక్ మాట్లాడుతూ× .. "వడ్డే నవీన్ గారు ఈ కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు థాంక్స్. నేను ఆయన చిత్రానికి అసిస్టెంట్, కో డైరెక్టర్‌గా పని చేశాను. నవీన్ గారితో సినిమా చేస్తున్న టైంలోనే 'ఆది'కి నాంది పలికినట్టు అయింది. నవీన్ గారు నన్నెంతో ఇష్టంగా చూసుకునేవారు. ఆయన కెరీర్‌లోని 90 శాతం సినిమాలు మనస్ఫూర్తిగా ఇష్టంతో చేయలేదు. ఆ విషయం నాకు తెలుసు. సినిమాల పట్ల ఆయనెప్పుడూ తృప్తిగా ఉండరు. ఓ సందర్భంలో ఆయన పరపతి చూసి షాక్ అయ్యాను. ఇకపై ఆయన తన మనసుకు నచ్చిన చిత్రాలే చేయాలని కోరుకుంటున్నాను. 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రం పెద్ద హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.

×వడ్డే నవీన్ మాట్లాడుతూ× .. "వినయ్ అప్పుడూ, ఇప్పుడూ వినయంగానే ఉన్నారు. ఆయన జర్నీ నాకెంతో గర్వంగా అనిపిస్తుంది. మా కోసం వచ్చిన వినయ్‌కి థాంక్స్. సినిమా కోసం టీం అంతా ఇష్టపడి చేశారు. ఈ పదేళ్లలో టెక్నికల్ పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మూవీలో కోర్ట్ డ్రామాతో పాటు సస్పెన్స్ బాగుంటుంది. ఏ ఫ్రైడే అయినా కూడా సింగిల్‌గా సినిమా రాలేదు. ఒకరితో పోటీ అని కాదు.. మూవీ బాగుంటేనే ఆడియెన్స్ చూస్తారు. ఈ చిత్రాన్ని సహజత్వానికి దగ్గరగా ఉండేలానే చూసుకున్నాం. ఇందులోని కంటెంట్ స్ట్రాంగ్‌గా ఉంటుంది. మాకు జీ టీం కూడా సపోర్ట్ చేస్తోంది. జూన్ 19న మా చిత్రం రాబోతోంది. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

×డైరెక్టర్ కమల్ తేజ నార్ల మాట్లాడుతూ× .. 'మా 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంటుంది. టీజర్, ట్రైలర్‌ల కంటే సినిమా అద్భుతంగా ఉండబోతోంది. మా కోసం వచ్చిన వినాయక్ గారికి థాంక్స్. నాకు ఈ అవకాశం ఇచ్చిన నవీన్ గారికి ఎప్పుడూ రుణపడి ఉంటాను. టీం అంతా ఎంతో కష్టపడి, ఇష్టపడి చేశారు. జూన్ 19న సినిమాని చూడండి. తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

×రాశీ సింగ్ మాట్లాడుతూ× .. 'మా కోసం వచ్చి, ట్రైలర్‌ను లాంచ్ చేసిన వి. వి. వినాయక్ గారికి థాంక్స్. మా టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్ కూడా అందరికీ నచ్చే ఉంటుందని ఆశిస్తున్నాను. జూన్ 19న మా చిత్రం రాబోతోంది. వడ్డే నవీన్ గారితో పాటు ప్రతీ ఒక్కరూ ప్రాణం పెట్టి పని చేశారు. అందరూ మా మూవీని చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×సంగీత దర్శకుడు కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ× .. 'మా 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ట్రైలర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. ఈ సినిమా పెద్ద సక్సెస్ కాబోతోంది. ఈ టీం నుంచి మరిన్ని మంచి చిత్రాలు రావాలని కోరుకుంటున్నాను. జూన్ 19న అందరూ మా మూవీని చూడండి' అని అన్నారు.


×విజయ్ పోలకి మాట్లాడుతూ× .. "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ట్రైలర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. వడ్డే నవీన్ గారితో వర్క్ చేయడంతో ఎంతో నేర్చుకున్నాను. ఇందులో నేను రెండు పాటలకు కొరియోగ్రఫీ అందించాను. నవీన్ గారు ఎంతో కూల్‌గా ఉంటారు. జూన్ 19న ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×కెమెరామెన్ కార్తీక్ సుజాత సాయికుమార్ మాట్లాడుతూ× .. "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ట్రైలర్ కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. మా సినిమాని అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×ఆర్ట్ డైరెక్టర్ భిక్షపతి కందకట్ల మాట్లాడుతూ× .. 'మా 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' పెద్ద విజయం సాధిస్తుంది. నవీన్ గారి ఎనర్జీ హై రేంజ్‌లో ఉంటుంది. జూన్ 19న మా సినిమాని అందరూ చూడండి' అని అన్నారు.

నటీనటులు : వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాథ్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు

# హిట్ అండ్ రన్' చిత్రంలో రిపోర్టర్ సాక్షి పాత్రలో నటాషా సింగ్



సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'హిట్ అండ్ రన్'. క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో రాబోతోన్న ఈ సినిమాను శ్రీ ఉరుకుంద ఈరణ్ణ స్వామి సమర్పణలో సతీష్ రెడ్డి అల్లం ఎంటర్టైన్మెంట్, శ్రీలక్ష్మి నరసింహస్వామి క్రియేషన్స్ బ్యానర్‌ల మీద సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన సంజయ్ రావ్ పాత్ర, ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్నాయి. 'హిట్ అండ్ రన్' కాన్సెప్ట్ తెలిసేలా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ అందరిలోనూ అంచనాలు పెంచేసింది.

తాజాగా ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ 'హిట్ అండ్ రన్' సినిమాలోని హీరోయిన్ పాత్రకు సంబంధించిన లుక్‌ను రివీల్ చేశారు. నటాషా సింగ్ ఈ సినిమాలో రిపోర్టర్ సాక్షి అనే పాత్రలో కనిపించనున్నారు. పోస్టర్‌లో కనిపిస్తున్న కారు, వెనకాల ఉన్న డీటైల్స్ అన్నీ కూడా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఇక హీరోయిన్ లుక్ కూడా చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది.

త్వరలోనే 'హిట్ అండ్ రన్' టీజర్‌తో అందరినీ మెస్మరైజ్ చేయనున్నారు. ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రీ సంగీతాన్ని అందిస్తున్నారు. డి. వెంకట్ ప్రభు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

×తారాగణం× : సంజయ్ రావ్, నటాషా సింగ్, కిరీటి, మురళీధర్ గౌడ్, లిరీషా కునపరెడ్డి, రవి ప్రకాష్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు

# 'ఒక్క చూపుతో మెదలైన..' మూవీ ట్రైలర్ విడుదల



శివచౌదరి, జశ్విక హీరో హీరోయిన్లుగా చెంచయ్య నూతలపాటి దర్శకత్వంలో శ్రీ ఆంజనేయ క్రియేషన్స్ పతాకంపై పోలూరి బిందుసారధి నిర్మిస్తున్న చిత్రం 'ఒక్క చూపుతో మెదలైన..'. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ విడుదలయింది. ఈ ట్రైలర్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హీరో శ్రీకాంత్ , నటుడు శివాజీరాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఒక్క చూపుతో మెదలైన..' ట్రైలర్ ను విడుదల చేసిన హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ .." చెంచయ్య నూతలపాటి దర్శకత్వంలో తెరకెక్కిన 'ఒక్క చూపుతో మెదలైన..' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని సినిమా ట్రైలర్ చూస్తే అర్ధమవుతుంది. పోలూరి బిందుసారధి నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పుడొస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండి అందరి మనసుల్ని గెలుచుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. సినిమా విజయం సాధించి ఈ సంస్థ నుంచి మరిన్ని మంచి చిత్రాలు రావాలని కోరుకుంటూ చిత్రం యూనిట్ కు ఈ సందర్భంగా బెస్ట్ విషెష్ చెప్పారు. నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ.. ప్రస్తుతం టాలీవుడ్ లో వస్తున్న చిత్రాలను మనం గమనిస్తూనే ఉన్నాం. మంచి కంటెంట్ తో వస్తున్న చిత్రాలను ప్రేక్షకులు ఎంతగానో ఆదరించి అక్కున చేర్చుకుంటున్నారు. మంచి విజయాల్ని అందిస్తూ నటీనటులను, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల వచ్చిన 'రాజు వెడ్స్ రాంబాయి'లాగే ఈ చిత్రం కూడా మంచి విజయాన్ని అందుకోవాలని అకక్నశించారు. దర్శకుడు చెంచయ్య నూతలపాటి మాట్లాడుతూ .." మంచి కంటెంట్ తో ఈ సినిమాను తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే విధంగా సినిమా సాగుతుంది. నిర్మాత పోలూరి బిందుసారధి సినిమా చక్కగా రూపొందడానికి పూర్తి సహకారాన్ని అందించారు. ఎక్కడా రాజీ పడకుండా మాకు ఏం కావాలంటే అది వెంటనే సమకూర్చి సినిమా బాగా రావడానికి తోడ్పడ్డారు" అని చెప్పారు.

నిర్మాత పోలూరి బిందుసారధి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి సహకరించిన ఆటో కిషోర్, లింగం గూడు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

శివచౌదరి, జశ్విక, డి.ఎస్. రావు, సత్యవర్మ, పటాస్ రాము, అమన్ సింగ్, సాయి రామకృష్ణ, చెంచయ్య, స్వరాజ్యం ప్రసన్నరాణి అంజలి, ఉషా, చిన్నీ, లక్ష్మీ తదితరులు నటించిన ఈ సినిమాకు కెమెరా: అనం వెంకట్, ఎడిటర్: మహేంద్రనాథ్, సంగీత: చైతన్య రాజు, కో –డైరెక్టర్ చందు, పి.ఆర్.ఓ : బాబునాయక్ (సినీసందడి, సినీలోకం), నిర్మాత పోలూరి బిందుసారధి, కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : చెంచయ్య నూతలపాటి,

# పార్కులను సందర్శించిన మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల బీ.ఆర్.ఎస్ నాయకులు



అంతస్తును గ్రంథాలయం మరియు వృద్ధుల వినియోగానికి కేటాయించే విధంగా భవనం నిర్మించాలని కోరుతున్నారు.

ఈ మూడు పార్కులు దేశానికి విశిష్ట సేవలు అందించి ప్రపంచ వ్యాప్తంగా గౌరవం పొందిన మహానేతలు పి.వి. నరసింహారావు గారు, మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేర్లతో ఉన్నాయి. అయితే ప్రస్తుతం వాటి దయనీయ పరిస్థితి ఆ మహానుభావుల పేర్లకే మచ్చ తెచ్చే విధంగా ఉంది.

**రాజేంద్రనగర్ ప్రజా బలం ప్రతినిధి 13 జూన్ 2026**ప్రజా సంక్షేమం మరియు ప్రాంతీయ అభివృద్ధిలో భాగంగా మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ఆయా ప్రాంతాల్లోని అభివృద్ధికి నోచుకోని పార్కులను సందర్శించి వాటి నిర్వహణ, పారిశుధ్యం మరియు సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు లోపాలు వెలుగులోకి వచ్చాయి.





క్రింది స్థాయి సిబ్బంది ఈ పార్కుల అసలు పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రాకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అందువల్ల ప్రతి పార్కును సంబంధిత ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా సందర్శించి, మంజూరైన నిధులను పారదర్శకంగా మరియు సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది కొరతను వెంటనే భర్తీ



1. బాలాజీ నగర్ కాలనీ – పీ.వీ.ఎన్.ఆర్ పార్క్:

నాలుగు నెలలుగా నిర్మాణ వ్యర్థాలు తొలగించకుండా ఉన్నాయి.

పారిశుధ్య నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది.

మహిళల, వృద్ధులు కూర్చునే సౌకర్యాలు లేవు.

చిన్నారుల ఆట పరికరాలు మరమ్మతులు చేసి తిరిగి అమర్చాల్సిన అవసరం ఉంది.

పార్కుల నిర్వహణకు సిబ్బంది కొరత ఉందని యూ.బీ.డీ మేనేజర్ తెలిపారు.

2. తనాషా నగర్ – మహాత్మాగాంధీ బతుకమ్మ పార్కు:

పార్క్ అంతటా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి పారిశుధ్యం పూర్తిగా దెబ్బతిన్నది.

ప్రమాదకరమైన విద్యుత్ తీగలు ఎటువంటి రక్షణ లేకుండా బహిరంగంగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

ఒక వైపున భారీగా చెత్త పేరుకు పోయింది.

పార్కుకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలం అభివృద్ధి లేక నిర్లక్ష్యంగా ఉంది.

రాత్రి వేళల్లో సంఘ వ్యతిరేక మరియు అక్రమ కార్య కలాపాలు జరుగు తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

3. తనాషా నగర్ హుడా కాలనీ – సర్దార్ పటేల్ పార్కు:

పారిశుధ్యం, నిర్వహణ పూర్తిగా లేకపోవడం గమనించ బడింది.

బలహీన వర్గాల కాలనీ వాసులు పార్కుకు ఆనుకుని ఉన్న ప్రదేశంలో గ్రౌండ్ ఫ్లోర్‌ను బహిరంగ ఉపయోగాలకు, మొదటి

చేసి పార్కులను ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని బీ.ఆర్.ఎస్ పార్టీ తరపున సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, విఠల్, భాను చందర్, జై రామ్, సుమనళిని, నాయుడు, శ్రీధర్, శ్రీశైలం, సుమన్, రాజు, చెరుకూరి బాలాజీ, బిందు, శ్రీనివాస్, శ్రీకర్ తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

# గుప్త నిధి దొరికిందంటూ మాయ మాటలు చెప్పి డబ్బులు తీసుకునే వారి సమాచారం మాకు అందజేయండి




**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 13** ఏటూరు నాగారం మండల కేంద్రంలో గత పది రోజులుగా. చర్చించే అంశంగా తయారైన విషయం ఏటూర్ నాగారంలో కొంతమంది బంగారు నిధి దొరికిందంటూ కొంతమంది బాధితుల నుంచి లక్షల రూపాయలు తీసుకున్నట్లు బంగారం ఆశ చూపి వారి కుటుంబంలోని బంగారం తీసుకున్నట్లుగా సమాచారం జరుగుతుంది కొంతమంది వ్యక్తులు మాకు బంగారం నిధి దొరికింది అంటూ వాటిని మార్చడానికి మాకు కొంత డబ్బు ఇస్తే మీకు లక్షకు రెండు లక్షలు ఇస్తామని చెప్పి వారి వద్ద నుంచి బంగారం నగదు డబ్బులు తీసుకున్నట్లు ఏటూరు నాగారం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ బాధితులు ఈరోజు. ఏట్నరీరు నాగారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు

దీనితో స్థానిక ఎస్ఐ మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు

ప్రజలారా ఇలాంటి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఇలాంటివారు మీకు బంగారం ఇస్తామని చెప్పి మీ దగ్గర నుండి డబ్బులు తీసుకునే వారి సమాచారం మాకు అందజేయండి మీలా మరి ఎవరు బాధపడకుండా ఉండాలంటే సమాచారం తప్పకుండా మాకు తెలుపాలని ఏటూరునాగారం ప్రజలను కోరారు

# మండువ మధుసూదన్ శర్మకు కాళోజీ నారాయణ రావు సాహితీ పురస్కారం












**రాజేంద్రనగర్ ప్రజా బలం ప్రతినిధి 13 జూన్ 2026** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాల్లో భాగంగా శనివారం రోజున తెలుగు వెలుగు సాహితీ వేదిక పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా వివిధ రంగాలలో విశేష సేవలు అందిస్తున్న వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వరంగల్ లోని తెలంగాణ నాన్ గజిటెడ్ అధికారుల సంఘ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి విశిష్ట సమయంలో మణికొండ పరిసర ప్రాంతాల్లో విశేష సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మండువ ఫౌండేషన్ అధ్యక్షులు మండువ మధుసూదన్ శర్మని గుర్తించి, సాహితీ సేవా రంగంలో కాళోజీ నారాయణ రావు సాహితీ గౌరవ పురస్కారంతో సత్కరించడం జరిగింది. అందుకు స్పందించిన మండవ మధుసూదన్ శర్మ తాను నిర్వహించే సేవా కార్యక్రమాలను గుర్తించి తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు పురస్కారాన్ని అందజేసి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎన్నో మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించి తనకు లభించిన సత్కారాన్నికి సార్థకథ చేసు కుంటానని తెలిపారు.

# తెలంగాణ నీటి హక్కులను కాపాడాలి

## జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రతి ఆయకట్టుకు సాగునీరు అందించాలి

### -ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం

**జహీరాబాద్, జూన్ 13 ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్ర సాధన ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రధాన నినాదాలపై సాగిందని, అందులో ముఖ్యమైనది నీటి హక్కుల పరిరక్షణ. కృష్ణా, గోదావరి నదులు తెలంగాణ గుండా ప్రవహిస్తున్నప్పటికీ గతంలో ఈ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా అన్యాయంగా నిర్లక్ష్యం చేయబడిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం అన్నారు. జహీరాబాద్ లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి -- బనకచర్ల -- కావేరి లింక్ ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నదిలో తెలంగాణకు లభించాల్సిన 213 టీఎంసీలు, అలాగే కృష్ణా నదిలో 90 టీఎంసీల నీటి వినియోగ అవకాశాలు దెబ్బతినే పరిస్థితి నెలకొందన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశంపై నిర్లక్ష్య వైఖరి అవలంబించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జహీరాబాద్ నియోజకవర్గం కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ 76 సాగునీటి చెరువులు ఉన్నాయని, వాటి ఆయకట్టు 12,265 ఎకరాలు. అయితే ప్రస్తుతం కేవలం 2,935 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు.మిగతా ఆయకట్టు నిరుపయోగంగా ఉందన్నారు.ఈ చెరువుల నిర్వహణ కోసం జహీరాబాద్‌లో ఒక ఇరిగేషన్ డివిజన్ ఏర్పాటు చేయబడింది. ఇందులో 1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 4 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,12 ఏఈ/ఏఈఈలు, సుమారు 30 మంది సాంకేతిక సిబ్బంది, 15 మంది పరిపాలనా సిబ్బంది పనిచేస్తున్నారు. వీరి నిర్వహణకు సంవత్సరానికి సుమారు రూ.4 కోట్ల ప్రజాధనం ఖర్చవుతోంది.



అయితే కాలువల దుస్థితి, చెరువుల బండల బలహీనత, నీటి పంపిణీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఆయకట్టు విస్తరణ జరగడం లేదన్నారు.. ప్రజాధనం ఖర్చవుతున్నా రైతులకు తగిన ప్రయోజనం అందడం లేదని ప్రభుత్వం వెంటనే చెరువుల మరమ్మతులు చేపట్టాలి, కాలువలను పునరుద్ధరించాలి, కొత్త సాగునీటి పనులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించి పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో శివకుమార్,యస్.గోపాల్,యస్,వెంకట్,వీర్ శెట్టి,మేఘనా థ్,తదితరులు ఉన్నారు

# ముందుంది కష్ట కాలం. రాష్ట్రాలను హెచ్చరించిన ప్రధాని నరేంద్ర మోదీ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 13 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :భారత్‌లోభవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ సవాళ్లపై ప్రధాని మోదీ, రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేశారు, నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో మాట్లాడిన ఆయన, (ఎల్ నినో,) పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దేశ అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన నీతి ఆయోగ్ 11,వ పాలక మండలి సమావేశంలో వాతావరణ మార్పులు ప్రధాన చర్చాంశంగా నిలిచాయి. ఈ సమావేశంలో పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు, పాల్గొన్నారు. భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించాలంటే,ఇప్పటి నుంచే సమర్థవంతమైన ప్రణాళికలు అమలుచేయాల్సినఅవసరంఉందని, ప్రధానిసూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణరూపొందించాలని చెప్పారు,ప్రపంచ వాతావరణ సంస్థ ( డబ్ల్యూఎం ఓ) సహా పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు 2026మధ్యకాలంలో (ఎల్ నినో )ప్రభావం కనిపించే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే అంచనా వేశాయి. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆసియా దేశాల్లో వర్షపాతం నమూనాలు మారిపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.

(ఎల్ నినో )అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితి. దీని ప్రభావం ప్రపంచంలోని అనేక దేశాలపై కనిపిస్తుంది. భారతదేశంలో అయితే ఇది రుతుపవనాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. సాధారణంగా (ఎల్ నినో) ప్రభావం పెరిగిన సంవత్సరాల్లో వర్షపాతం తగ్గడం, వడగాలులు అధికమవడం, కొన్ని ప్రాంతాల్లో కరవు పరిస్థితులు ఏర్పడటం వంటి సమస్యలు కనిపిస్తాయి. వ్యవసాయ రంగంపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంటుంది.భవిష్యత్తులో నీటి కొరత సమస్యలనుఎదుర్కోవాలంటే,ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ప్రధాని రాష్ట్రాలకు సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను విస్తరించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం, సాగునీటిని సమర్థంగా వినియోగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి నిర్వహణకు సంబంధించి కొత్త విధానాలు రూపొందించాలని కూడా సూచించారు.

## బుల్లెట్ ట్రైన్ కోసం సంఘటిత ఉద్యమం
## - రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్ రావు




**జహీరాబాద్, జూన్ 13 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణానికి బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు రాష్ట్ర సాధన తరహాలో సంఘటిత ఉద్యమాన్ని చేపడతామని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం బుల్లెట్ ట్రైన్ సాధనకై కాంగ్రెస్, బిజెపి, బి.ఆర్.ఎస్, ఎంఐఎం, సిపిఐ, సిపిఎం, టిఆర్పి, ఉద్యోగ సంఘాలు, వ్యాపార వర్తక సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ పట్టణం మీదుగా ఉన్న బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనలను చెరుపేసి వికారాబాద్ మీదుగా డీపీఆర్ను సిద్ధం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్






ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి రైతులు వేలాది ఎకరాల భూమిని త్యాగం చేశారని. రానున్న రోజుల్లో జహీరాబాద్ ఆర్థిక పట్టణంగా ఎదిగే అవకాశాలను తరుణంలో బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని మళ్లించడం సరైంది కాదన్నారు. జహీరాబాద్ మీదుగా బుల్లెట్ ట్రైన్ సాధించేవరకు సంఘటితంగా అందరం కలిసి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యక్రమం ప్రకటించి ఉద్యమాన్ని చేపడతామన్నారు. అనంతరం కేంద్ర రైల్వే మంత్రి కి సంతకాలతో కూడిన లేఖను రాసి రైల్వే స్టేషన్ లో స్టేషన్ మాస్టర్ కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉజ్వల్ రెడ్డి, ఐ డి సి మాజీ చైర్మన్ తన్వీర్, మున్సిపల్ చైర్మన్ యూనుస్ ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప.మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# భూమి కోసం ఆత్మహత్య ప్రయత్నం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 13 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** : వట్టిపల్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు, పెట్రోల్ పోసుకొని నిరసన, ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జరిగింది, వివరాల్లోకి వెళ్తే గట్టుపల్లి కి చెందిన, చింతక మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి చింతాకి, సంగారెడ్డి, చింతాకు శ్రీమంత్ రెడ్డి, గార్లకు చెందిన, సర్వే నంబర్ 83,లో గల భూమిని వేరే వారి పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని, ఆరోపిస్తూ ఎమ్మార్వో కార్యాలయం ముందు, వట్టిపల్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిరసన వ్యక్తం చేశారు, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని, వారిని నిలువరించారు....

# నిరుద్యోగ యువతకు సువర్ణవకాశం - జూన్ 17 న మెగా జాబ్ మేళా

**అవకాశాన్ని అందిపుచ్చుకోండి... విజయవంతమైన జీవితానికి నాంది పలకండి.**

**-- జిల్లా ఎస్ పి కేకాన్ సుధీర్ రామనాథ్ ఐ పి ఎస్**



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 13 ఎస్పీ ఆఫీస్** గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించి వారి కుటుంబాల భవిష్యత్తును వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ములుగు జిల్లా పరిపాలన యంత్రాంగం కలిసికట్టుగా "మెగా జాబ్ మేళా -- 2026" జూన్ 17 న ఇంచెర్ల గ్రామం నందు గల ఎం ఆర్ గార్డెన్/ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించబోతుంది .

ఈ మెగా జాబ్ మేళాకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా శిశు సంక్షేమ శాఖల గౌరవ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఈ కార్యక్రమం 2026 జూన్ 17వ తేదీ, బుధవారం ఉదయం 9 గంటల నుండి ములుగు పట్టణంలోని ఎం.ఆర్. గార్డెన్స్, ఇంచర్లలో నిర్వహించబడుతుంది.

ఈ జాబ్ మేళాలో 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇంజినీరింగ్, టెక్నికల్, ఫార్మసీ, స్కిల్డ్ వర్క్, సర్వీస్ మరియు ఇతర పలు రంగాలకు సంబంధించిన ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టనున్నారు.ఇట్టి ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్ వంటి మెట్రోపాలిటన్ సిటీ లోనే కాకుండా ప్రాంతీయ జిల్లాలలో సైతం అవకాశాన్ని బట్టి కంపెనీలు ఎంపిక చేయడం జరుగుతుంది.

ఉద్యోగ అర్హతలు

7వ తరగతి ఉత్తీర్ణులై , ఎస్ ఎస్ సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ మరియు సమాన అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిపాలన కోరుతోంది.

అభ్యర్థులు తమతో పాటు:

నూతన (ప్రస్తుత )బయోడేట

పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు

విద్యార్హతల ధ్రువపత్రాలు

ఆధార్ కార్డు మరియు ఇతర అవసరమైన పత్రాలు

తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

గ్రామీణ యువత తమ ప్రతిభను చాటుకునేందుకు, మంచి ఉద్యోగాన్ని సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునేందుకు ఇది ఒక అరుదైన అవకాశం అని అధికారులు తెలిపారు.

మరిన్ని వివరాల కోసం:

డీఎస్పీ ములుగు: 8712670103

సీఐ ములుగు: 8712670111

సంప్రదించగలరు.

ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ కోసం ॰ు= కోడ్ ను ఉపయోగించుకోగలరు.

జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా పరిపాలన విజ్ఞప్తి చేయడమైనది

## మంగపేట మండల సీనియర్ నాయకుడుమాలికంఠ శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శింన మాజీ జడ్పీ శ్రీమతి బడే లినాగజ్యోతి-



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 13 మంగపేట** మంగపేట మండలం రాజుపేట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, మంగపేట మండల సీనియర్ నాయకులు , మాలికంఠ శంకర్, మొన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బడే నాగజ్యోతి ,, నిన్న హుటాహుటిన ఏటూరునాగారం హాస్పిటల్ లో మార్చురి రూమ్ లోమృతి దేహాన్ని సందర్శించి భావోద్వేగానికి, అలాగేఈరోజు స్వగృహమైన రాజుపేటలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన నాగజ్యోతి ఈ సందర్భంగా వారు మాట్లాడుతుశంకర్ గారి అకాల మరణం పార్టీకి, ఉద్యమ శక్తులకు తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళలర్పించారు.భావపూర్వక శ్రద్ధాంజలిఈ కార్యక్రమంలో మంగపేట మాజీ మండల పార్టీ అధ్యక్షులు కుదుముల లక్ష్మి నారాయణ, మండల మాజీ ప్రధాన కార్యదర్శి రాజుయాదవ్,మల్లూర్ దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, పార్టీ సీనియర్ నాయకులు,కర్రీ శ్యాంబాబు, చల్లగురుగుల తిరుపతి, పార్టీ నాయకులు, హుసేన్, పంజాల సత్యం,మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు రావుల రమణ, చదలవాడ సాంబశివ రావు, రొడ్డ సుదర్శన్, సాంబులు, యూత్ నాయకులు,గుండారాపు రమేష్,పిల్లలమర్రి వేణు, గౌని రమేష్ గౌడ్,మంచాల నాగేందర్,సుధీర్,నాగ,సోషల్ మీడియా వారియర్స్, బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు

## గంజాయి నియంత్రణ శాంతిభద్రత పై ప్రజలతో అవగాహన కార్యక్రమం
## ఎస్ఐ. మల్లేశ్వరరావు




అరకులోయ అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అరకులోయ మండలం లోతేరు పంచాయితీ లోతేరు మారుమూల గ్రామంలో అరకు ఎస్ఐ మల్లేశ్వరరావు పోలీస్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు అనంతరం గ్రామ ప్రజలతో ఎస్ఐ మాట్లాడుతూమహిళల భద్రత పై మహిళలకు అవగాహన కల్పిస్తూ,గంజాయి నేరాలు నివారణ, రోడ్డు ప్రమాదాలు నివారణ, నాటు సారా పై అవగాహన కనిపిస్తూ ప్రతి ఒక్క యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ముఖ్యంగా గంజాయి సాగు చేయడం రవాణా చేయడం చేసినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు గంజాయి నాటసార కు దూరంగా ఉండాలని రోడ్డు ప్రమాదల నివారణ పై యువత కు అవగాహన కల్పిస్తూ ఎవరైనా రోడ్లపై వాహనాలతో వేగంగా వాహనాలు నడపడం హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఉన్నట్లయితే వాళ్లపై చట్టపరమైన చర్యలు ఉంటాయని అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని హెచ్చరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, ప్రజలు యువతి యువకులు మహిళలు పాల్గొన్నారు

# ప్రతి మహిళ స్వయం శక్తితో ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకోవాలి...

## స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 13(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ




సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్‌పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మగ్గం శిక్షణ పూర్తి చేసిన శిక్షణార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు,ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఎం. రాజేష్ కుమార్ పుష్పగుచ్ఛంతో శ్రీమతి నిర్మల జగ్గారెడ్డికి ఘన స్వాగతం పలికారు,అనంతరం శిక్షణార్థులందరూ కరతాళధ్వనులతో ఆమెకు హృదయపూర్వక స్వాగతం తెలిపారు,కార్యక్రమంలో భాగంగా




బ్యూటీ పార్లర్ శిక్షణ పొందుతున్న 34 మంది శిక్షణార్థినులు రూపొందించిన బ్రైడల్ మేకప్ ప్రదర్శనను శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.అమ్మవారి గెటప్, భారతమాత గెటప్‌తో పాటు వివిధ సాంప్రదాయ అలంకరణలతో శిక్షణార్థినులు చేసిన ప్రదర్శనలు ఆమెను విశేషంగా ఆకట్టుకున్నాయి,ఈ సందర్భంగా డైరెక్టర్ ఎం. రాజేష్ కుమార్ సంస్థ కార్యకలాపాలు, శిక్షణా కార్యక్రమాల గురించి వివరించారు,ఎస్బిఐ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సంస్థలో గ్రామీణ యువతకు పూర్తిగా ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని శిక్షణతో పాటు భోజన వసతి (హాస్టల్) సౌకర్యం కూడా కల్పిస్తున్నామని తెలిపారు,సంస్థలో శిక్షణ పొందిన వారిలో అధిక శాతం మంది స్వయం ఉపాధి లేదా ఉపాధి అవకాశాలు పొందుతూ జీవితంలో స్థిరపడుతున్నారని వివరించారు,ఈ విషయాలను తెలుసుకున్న శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి సంస్థ సేవలను ప్రశంసిస్తూ, గ్రామీణ యువత అభివృద్ధికి కృషి చేస్తున్న డైరెక్టర్ ఎం. రాజేష్ కుమార్ ని అభినందించారు,అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. "ఆడపిల్ల అభల కాదు ఆది పరాశక్తి" అని కొనియాడుతూ, ప్రతి మహిళ స్వయం శక్తితో ఎదిగి ఆర్థికంగా సామాజికంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు,ఎక్కడ అన్యాయం జరిగినా ధైర్యంగా ప్రశ్నించాలని, తమ హక్కుల కోసం నిలబడాలని సూచించారు,శిక్షణార్థులు ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను మధ్యలో వదిలేయకుండా నిరంతరం సాధన చేస్తూ స్వయం ఉపాధి ద్వారా గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు,భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ సేవలను స్మరించుకుంటూ ఆమె నాయకత్వం మహిళలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు,మహిళలు తమ ప్రతిభను నమ్ముకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శిక్షణార్థులను ఉత్సాహపరిచారు,ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్ నాయక్,సంస్థ కో-ఆర్డినేటర్లు శివశంకర్, నర్సింలు, జేఆర్‌పీ లక్ష్మీప్రియ, దుర్గ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# దత్తగిరిలో వైభవంగా శని త్రయోదశి పూజలు

## - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జహీరాబాద్ ఆర్డీవో



**జహీరాబాద్, జూన్ 13 ప్రజాబలం ప్రతినిధి** :సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ గ్రామంలో ఉన్న శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో వెలసిన శ్రీ శనీశ్వర స్వామి దేవాలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఆర్డీవో దేవుజా కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి శ్రీ శనీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలోని జ్యోతిర్లింగాలు, పంచవృక్షాలు, శ్రీ దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆర్డీవోకు ఆశ్రమ పీఠాధిపతి శ్రీ అవధూతగిరి మహారాజ్ పూలమాలలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. శని త్రయోదశి సందర్భంగా ఆశ్రమంలో భక్తుల రద్దీ నెలకొంది.

# కలెక్టరేట్ ను అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయండి

## యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి:

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవనం పరిశీలన.కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేటు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, రోడ్లు-భవనాల శాఖ అధికారులకు,కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి,మౌలిక సదుపాయాల పనులు పూర్తి అవ్వాలని స్పష్టం చేశారు.అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రోటోకాల్ ఏర్పాట్లు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రెస్టారెంట్ ఫుడ్ తో మెడికల్ విద్యార్థుల అస్వస్థత

## రెస్టారెంట్ ను మూసివేసిన అధికారులు




**పెద్దపల్లి, జూన్ 13, ప్రజాబలం ప్రతినిధి :** పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో చికెన్ మండి తిన్న కొంతమంది సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. దీంతో వాంతులు, విరేచనాలు మరియు కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపించాయని శనివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందారని సమాచారం మేరకు అధికారులు మెడికల్ కాలేజ్ హాస్టల్‌ను సందర్శించి, ప్రభావిత విద్యార్థులతో వివరంగా మాట్లాడారు. అలాగే వారికి చికిత్స అందించిన వైద్యుడితో కూడా మాట్లాడారు. అనంతరం వారు ఆహారం కొనుగోలు చేసిన రెస్టారెంట్‌ను తనిఖీ చేసారు. ఆ రెస్టారెంట్ పేరు డెస్టినేషన్ ఆ సంస్థ యొక్క FSSAI లైసెన్స్ నంబర్: 13623020000134 ఉందని,



తనిఖీలో పలు ఉల్లంఘనలు గుర్తించారు. అందులో ముఖ్యంగా వంటగది ప్రాంతంలో ఈగల అధిక సంచారం గమనించినట్లు, వంటగది లోపల మరియు బయట 5-6 ఎలుకలు స్వేచ్ఛగా తిరుగుతూ కనిపించాయని, వంట కోసం ఉపయోగిస్తున్న నూనెను టీపీసీ మీటర్ ద్వారా పరీక్షించగా, దాని విలువ అనుమతించబడిన 25% పరిమితిని మించిపోయినట్లు గుర్తించబడిందని, వంటగదిలో ఉన్న మయోనైస్‌ను ముడి గుడ్లతో తయారు చేసినట్లు అనుమానం వ్యక్తమైందన్నారు. భోజనశాల అంతటా దుర్వాసన వ్యాపించి ఉన్నట్లు గమనించబడిందని,
మొత్తంగా పరిశీలించగా ఆ రెస్టారెంట్ అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితుల్లో నిర్వహించబడుతున్నట్లు గుర్తించారు. ప్రయోగశాల విశ్లేషణ కోసం ఆహార నమూనాలు సేకరించబడ్డాయని
అడ్జుడికేషన్ ప్రక్రియ కోసం షెడ్యూల్-IV ఉల్లంఘనల తనిఖీ నిర్వహించబడిందని
ప్రస్తుత పరిస్థితుల్లో రెస్టారెంట్ నిర్వహణకు అనర్హమని స్పష్టంగా తేలినందున, ఆ రెస్టారెంట్ ను తాత్కాలికంగా మూసివేయనున్నట్లు తెలిపారు. ఈ రెస్టారెంట్ తిరిగి ప్రారంభించే ముందు తప్పనిసరిగా చేపట్టవలసిన అన్ని సవరణలు మరియు పరిశుభ్రతా చర్యల గురించి యాజమాన్యానికి వివరంగా తెలియజేసినట్లు పేర్కొన్నారు.

# నియంత దేశంలో ఉన్నామా ? అనుమానం కలుగుతుంది ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు
ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా?
నియంత దేశంలో ఉన్నామా ? అనుమానం కలుగుతుంది
కేసు లేదు ఏమి లేదు నోటీసు మాత్రమే ఇచ్చింది
Fir లేనపుడు కేసు ఎక్కడిది?
పసలేని కేసును పట్టుకొని దుర్బుద్ధితో నోటీసు మాత్రమే ఇచ్చింది
ఆర్ ఓ కి తిరస్కరించే అధికారం లేకున్న తిరస్కరించారు
ఆర్ఓని ఉరి వేసిన తప్పులేదు
రాజ్య సభలో బలం పెంచుకోవాలని కుట్రకు పూనుకున్నారు
గాంధేయ వాది నియయితికి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్
ప్రధాని మంత్రి ఆఫీసు ఇన్వాల్వ్ అయ్యి కేసును తప్పుదోవ పట్టించారు
ఈ విషయంలో ఉరి వేసిన తప్పులేదు
రాజకీయ ఒత్తిడి వల్ల ఆర్ఓ ఆఫీసులో కూర్చుని
ప్రధాని నియంత లా వ్యవహరించడం శోచనీయం
సుప్రీంకోర్టు లో కూడా న్యాయం జరగలేదు
బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి
మీనాక్షి నాకు సోదరి లాంటివారు
24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరం
మీనాక్షి గారిని బలి చేశారు
మీనాక్షి విషయంలో కొంత మంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసింది
బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారు
లీకు వీరులు గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారు
ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి మాపై బురద జల్లుతున్నారు
రాజకీయాల్లో విభేదాలు సహజం.అంత మాత్రాన కుట్రకు పాల్పడరు



ఓటు చోరీ చేసి..ఇప్పుడు సీటు చోరీ చేశారు
ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం సిగ్గుచేటు
మీనాక్షి కి కేసుకు అసలు సంబంధం లేదు
రాజ్యాంగాన్ని ఇంత దుర్మార్గంగా అవమానిస్తారా?
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఇలా వ్యవహరిస్తే మోడీ ప్రధాని అయ్యేవారా?ముఖ్యమంత్రి అయ్యేవారా?
బెంగాల్ ,మహారాష్ట్ర లో బీజేపీ ఏం చేసిందో దేశ ప్రజలు చూశారు
12 ఏళ్లలో మోదీ చేసింది ఏమి లేదు
షబ్బీర్ అలీ ఆరోపణలు పై తొందరపడి స్పందించాల్సిన అవసరం లేదు
నా ఆస్తులు, నా వ్యక్తిత్వం నేను ఏంటో నిజామాబాద్ ప్రజలకు తెల్సు
చంద్రశేఖర్ రెడ్డిని స్వయంగా షబ్బీర్ అలీ సీఎం సమక్షంలో చేర్పించారు
షబ్బీర్ అలీకి షోకాజ్ ఇచ్చాం
ఇన్నాళ్లు రాజకీయాలూ ఉంది షబ్బీర్ అలీ అలా మాట్లాడటం సబబు కాదుమహిళలను చులకన చేసి మాట్లాడటం విచారకరం
ఏడాది కిందటి మాట్లాడిన ఆడియో బయటకు వచ్చిందీ
కేటీఆర్ స్పందించాల్సింది
మీనాక్షి నటరాజన్ గురించి నేను ఏంటో కేటీఆర్ కంటే హరీష్ రావుకు బాగా తెలుసు
ప్రాంతీయ తత్వం రెచ్చగొట్టి బిఆర్ ఎస్ అధికారంలోకి వచ్చారని పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలి
కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాలు సమానం
ఫోర్త్ సిటీ అడ్డుకుంటామని అనడం మూర్ఖత్వం
బిఆర్ ఎస్ పార్టీకి రాష్ట్రంలో అధికారం లేదు
మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
రేవంత్ రెడ్డి మీద వ్యక్తిగత కక్ష్యతో మాట్లాడితే
పదేళ్ల కాలంలో ఆర్థిక విధ్వంసం ,భూ దోపిడీ, అప్పు పై వివరణ ఇచ్చి బస్సు యాత్ర, పాదయాత్ర లు చేయండి
పాదయాత్రలు రాజకీయాల్లో అనేక సార్లు మలుపు తిప్పిన ఘటనలు ఉన్నాయి
కాంగ్రెస్ జీవన్ రెడ్డి ది ముగిసిన అధ్యాయం
అరాచకం చేస్తామని బీజేపీ ఎంపీ అరవింద్ నిస్సిగ్గుగా ఒప్పుకుంటున్నారు
వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఇప్పుడు ఉన్న 8 మంది బీజేపీ ఎంపీలు ఓడిపోతారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com